# మహానది

MAHANADI TELUGU DAILY

Website: www.mahanadi.net

RNI No. TELTEL . 2012/48343

రంగారెడ్డి | సంపుటి : 4 | సంచిక : 47 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | శనివారం | ఏప్రిల్ | 12 | 2025 పేజీలు : 8 | వెల : రూ.2.00


## రైతులు అధైర్యపడొద్దు: మంత్రి తుమ్మల

సిద్దిపేట,ఏప్రిల్ 11: రాష్ట్ర వ్యాప్తంగా గత 3, 4 రోజులుగా కురిసిన భారీ వర్షాల కారణంగా సుమారు 24 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, ఇందులో ఎక్కువగా సిద్దిపేట జిల్లాలోనే పంటలకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబుతో కలిసి ఆయన సిద్దిపేట జిల్లా, చిన్నకోడూరు మండలం, ఇబ్రహీంనగర్‌లో శుక్రవారం పర్యటించి ఇటీవల కురిసిన వడగండ్ల వానలకు నష్టపోయిన పంటలను పరిశీలించి మాట్లాడారు. రైతులు అధైర్యపడవద్దని, రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారాన్ని అందించి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో పంట నష్టం వి వరాలకు సేకరిస్తున్నామన్నారు. గత 3, 4 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా కురుస్తున్న వడగండ్ల వానతో రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చిందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన పంటల వివరాలను త్వరతగతిన సేకరించి ప్రభుత్వానికి పంపాలన్నారు.

## జాతీయ రహదారులు, ఆర్ఆర్ఆర్ పురోగతిపై సీఎం సమీక్ష..




హైదరాబాద్,ఏప్రిల్,11: రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అధి కారులకు సూచించారు. రీజినల్ రింగ్ రోడ్డు సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం, ఆర్ఆర్ఆర్ పనుల పురోగతిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమా వేశంలో సమీక్షించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్ – విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణా నికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హెూం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టి సారించాలని సీఎం రేవంత్ సూచించారు. రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగానికి సంబం ధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్స ల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రతిపక్షాలకు కుటుంబ ప్రయోజనాలే ముఖ్యం..

### - ప్రతిపక్షాలపై మోడీ విమర్శలు
### - వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని





వారణాసి,,ఏప్రిల్ 11: ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష పార్టీలు అధికార కాంక్షతో కుటుంబ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిస్తున్నాయని విమర్శించారు. కానీ తమ పార్టీ ఎటువంటి పదవీ కాంక్ష లేకుండా సమ్మిళిత అభివృద్ధి ఇతివృత్తంగా ముందుకు సాగుతోందని అన్నారు. ఎన్డీఏ కూటమి నేతలంతా ప్రతి ఒక్క పౌరుడి అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. పులే దంపతులను ఆదర్శంగా తీసుకొని తాము మహిళల విద్య, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో రూ.3,880 కోట్ల విలువైన 44 ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన ప్రధాని అక్కడి వారినుద్దేశించి ప్రసంగించారు. ప్రతిపక్షాలు 'పరివార్ కా సాథ్ పరివార్ కా వికాస్' (కుటుంబంతో కలిసి.. కుటుంబం కోసం) అనే విధానాన్ని అనుసరిస్తాయని ప్రధాని పేర్కొన్నారు. కానీ దానికి విరుద్ధంగా తామెప్పుడూ 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్' (అందరితో కలిసి..అందరి కోసం) నినాదంతో ముందుకువెళ్తామన్నారు. ప్రస్తుతం ప్రారంభించిన ప్రాజెక్టుల్లో కూడా గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేశామని అన్నారు. వాటిలో 130 తాగునీటి ప్రాజెక్టులు, నాలుగు గ్రామీణ రోడ్లు, 100 కొత్త అంగన్‌వాడీ కేంద్రాలు, 356 గ్రంథాలయాలు, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నాయని ప్రధాని తెలిపారు. గతంలో పూర్వాంచల్‌లో ఆరోగ్య సౌకర్యాలు తక్కువగా ఉండేవని, కానీ నేడు కాశీ పూర్వాంచల్‌కు ఆరోగ్య రాజధానిగా మారుతోందని ప్రధాని అన్నారు. భారత్ అభివృద్ధి, వారసత్వం అనే రెండింటితో ముందుకువెళ్తోందని పేర్కొన్నారు.



## నెక్లెస్ రోడ్డులో పూలే విగ్రహం: సీఎం

హైదరాబాద్,ఏప్రిల్ 11: మహాత్మా జ్యోతిబా పూలే స్ఫూర్తి ప్రదాత అని, ఆయన స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వ నిర్ణయాలు ఉంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం పూలే జయంత్యుత్సవం సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలకు మార్గదర్శిగా, బహుజన చైతన్య దీప్తిగా నిలిచి వివక్షలపై పోరాడి,మహిళా విద్యకు విశేష కృషి చేశారని గుర్తు చేశారు. పూలే స్ఫూర్తితోనే సామాజిక సాధికారత కోసం తెలంగాణలోని ప్రజా ప్రభుత్వం తీసుకున్న సమగ్ర కుల గణన, బీసీలకు 42 శాతం కోటా రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ వంటి సామాజిక న్యాయసాధికారత నిర్ణయాలు తీసుకున్నట్లు సీఎం చెప్పారు. మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహం ఏర్పా టు విషయంలో తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఆయన జయంతి రోజే హైదరాబాద్ నెక్లెస్ రోడ్ ఐమాక్స్ సమీపంలో ఆయన విగ్రహ ఏర్పాటుకు సీఎం రేవంత్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు.

## మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం
# ఇదే రేవంత్ పాలన : కెటిఆర్



హైదరాబాద్,ఏప్రిల్ 11:రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 3డీ మంత్రంతో (మోసం, విధ్వంసం, దృష్టి మళ్లించడం) పాలన చేస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రేవంత్ ప్రభుత్వం ఆర్థిక నేరానికి తెరలేపిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భారీ కుంభకోణాలు జరుగుతున్నాయని చెప్పారు. కంచ గచ్చిబౌలిలో జరిగిన పర్యావరణ విధ్వంసాన్ని చూసి దేశం మొత్తం విస్తుపోయిందన్నారు. మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతోమాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డికి అన్నీ తెలిసే భారీ ఆర్థిక నేరానికి పాల్పడ్డారని మండిపడ్డారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంతో దేశం మొత్తంతెలంగాణ వైపు చూస్తోందన్నారు. ఆ400 ఎకరాలు అటవీ భూమేనని, సుప్రీంకోర్టు తీర్పుల ఆధారంగా ఆ విషయాన్ని చెబుతున్నానని స్పష్టం చేశారు. హెచ్‌సీయూ భూముల వెనుక 10 వేల కోట్ల ఆర్థిక కుంభకోణంఉందన్నారు. కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంటూ ఆరోపించారు. ఒక బీజేపీ ఎంపీ సహకారంతో ఈ స్కామ్‌కు చేస్తున్నారని ఈ స్కామ్ చేస్తున్నారని ఆరోపించారు.

# తెలంగాణ టెట్ నోటిఫికేషన్ విడుదల

### జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ పరీక్షలు
### పూర్తి వివరాలు ఏప్రిల్ 15న వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు వెల్లడి - వెల్లడించిన పాఠశాల విద్యా శాఖ



హైదరాబాద్,ఏప్రిల్,11: తెలంగాణ ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. పాఠశాల విద్యాశాఖ తెలిపిన వివరాల ప్రకారం... జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిం చనున్నారు. ఈ పరీక్షకు సంబంధించిన పూర్తి వివరాలను ఏప్రిల్ 15వ తేదీన అధికారిక వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉంచనున్నట్లు వెల్లడించింది. ఏప్రిల్ 15 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. జూన్ 15 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తారు. జులై 22వ తేదీన ఫలితాలు విడుదల చేయనున్నారు. ఒక పేపర్ రాసేవారికి రూ. 500, రెండు పేపర్లు రాసేవారికి రూ. 1,000గా రుసుమును నిర్ణయించారు. జూన్ 9వ తేదీ నుంచి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.తెలంగాణలో ఏడాదికి రెండుసార్లు (జూన్, డిసెంబర్) టెట్ పరీక్ష నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా గత ఏడాది డిసెంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది జనవరిలో పరీక్షలు నిర్వహించింది. జనవరిలో జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్షకు 2.75 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, రెండు లక్షల మందికి పైగా హాజరయ్యారు.

## తెలంగాణ లోకాయుక్తగా రిటైర్డ్ జడ్జి ఎ. రాజశేఖర్ రెడ్డి

హైదరాబాద్,ఏప్రిల్,11:తెలంగాణ లోకాయుక్తగా రిటైర్డ్ జడ్జి ఎ.రాజశేఖర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప లోకాయుక్తగా బి.ఎస్. జగ్జీవన్ కుమార్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్‌గా షమీమ్ అక్తర్ నియమితులయ్యారు.
మానవ హక్కుల కమిషన్ సభ్యులుగా శివాడి ప్రవీణ, బి. కిశోర్‌లను ప్రభుత్వం నియమించింది. దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న మానవ హక్కుల కమిషన్ చైర్మన్, లోకాయుక్త, ఉపలోకాయుక్త పోస్టుల భర్తీ కోసం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 5వ తేదీన సచివాలయంలో సమావేశమైన సెలక్షన్ కమిటీ అభ్యర్థుల జాబితాను పరిశీలించి వీరి పేర్లను ఖరారు చేసింది.

# భూభారతి చట్టంతో పేదలకు భూమిపై సంపూర్ణ హక్కులు

## సీతారామ కాలువ, పోడు భూముల సమస్యలు త్వరలో పరిష్కారం : మంత్రి పొంగులేటి

హైదరాబాద్,ఏప్రిల్ 11: ఇందిరమ్మ ప్రభుత్వంలో భూ హక్కుల కోసం చారిత్రాత్మక అడుగులు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో మాట్లాడుతూ, ఇందిరమ్మ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అంకితమై పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రగతి భవన్‌ను జ్యోతి రావు పూలే భవనంగా మార్చిన ఘనత కూడా ఈ ప్రభుత్వానిదేనని అన్నారు.ఇది ప్రజలకు గౌరవం ఇచ్చే ముఖ్యమైన చిహ్నంగా నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధరణిలో చోటుచేసుకున్న అవకతవకలన్నీ సరి చేయడం కోసం కొత్త భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకురావడమే కాకుండా, మూడు నెలలు కూడా పూర్తవకముందే దానికి సంబంధించి నవిధానాలు రూపొందించడంలో ప్రభుత్వం చూపిన వేగాన్ని మంత్రి వివరించారు.
అంబేడ్కర్ జయంతి రోజున శిల్పారామంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూభారతి చట్టాన్ని ప్రజలకు అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. పేదవారు సంపాదించిన భూమిపై సంపూర్ణ హక్కులు కల్పించేలా ఈ చట్టాన్ని రూపొందించామని, గత పదేళ్లలో అనేక భూసంబంధిత ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజల అవసరాల్ని దృష్టిలో పెట్టుకొని ఈచట్టం రూపొందించబ డిందని పేర్కొన్నారు. ఒక్క గజం భూమికి కూడా భద్రత కల్పించేలా భూభారతిలో ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో 8.19లక్షల కోట్లు అప్పు చేసి, నాయకులు ఫామ్ హౌస్‌లలో విశ్రాంతి తీసుకున్నారని విమర్శించారు. మరోవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ఆర్థిక ఒత్తిళ్లమధ్య ఉన్నప్పటికీ, ఎన్ని కల్లో ప్రజలకు ఇచ్చిన హామీ లను సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నారని కొనియాడారు. కాళేశ్వ రం ప్రాజెక్టుపై కూడా మంత్రి స్పందించారు.
గత ప్రభు త్వంలోనే ప్రాజెక్టు వాస్తవానికి కూలిపోయిందని తెలిపారు.కానీఅయినా రైతులు వర్షాకాలంలో దేశంలోఎక్కడా లేనివి ధంగా అధికంగా ధాన్యం ఉత్పత్తి చేయగలిగారని గర్వంగా వెల్లడించారు. రాష్ట్రఆర్థిక పరిస్థితికారణంగా కొన్ని హామీల అమలు ఆలస్యం అవుతున్నా, ప్రభుత్వం ఆర్థికవ్యవస్థను గాడిలో పెడుతూ ప్రతిహామీని నెరవేర్చేందుకు కృషి చేస్తోం దని మంత్రి స్పష్టం చేశారు.



# నయీమ్ కేసులో రంగంలోకి ఈడీ..!

హైదరాబాద్,ఏప్రిల్ 11:గ్యాంగ్‌స్టర్ నయీమ్ కేసులోకీలక పరిణామం చోటుచేసుకుంది. నయీమ్ కేసులో ఎన్ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగనుంది. నయీమ్ పెద్ద మొత్తంలో అక్రమ ఆస్తులను కూడబెట్టినట్లు అధికారులు గుర్తించారు. పలువురు రాజకీయ నేతలు, వ్యాపారులకు నయీమ్ బినామీగా ఉండి.. వారి లావాదేవీలకు అండగా ఉండి డబ్బుల తరలింపుకు పాల్పడ్డట్లు గుర్తించారు. కాగా 2016, ఆగష్టులో తెలంగాణ పోలీసులు ఎన్‌కౌంటర్‌లో హతం అయ్యాడు నయీమ్.. ఇక, నయీమ్ ఎన్‌కౌంటర్ తర్వాత పెద్ద మొత్తంలో ఆస్తులు వెలుగులోకి వచ్చాయి. నయీమ్‌తోపాటు అతడి



భార్యాపిల్లలు, బావమరిది, బినామీల పేరుతో పెద్ద ఎత్తున ఆస్తులను గుర్తించారు. తాజాగా ఈడీ చర్యలు ప్రారంభించింది.నయీమ్ కు సంబంధించిన 35 ఆస్తులు జప్తు చేసేందుకు ఈడి చర్యలు చేపట్టింది. 35 ఆస్తులను నయీమ్ కుటుంబ సభ్యులు,సన్నిహితుల పేర్ల మీద రిజిస్ట్రేషన్ చేసినట్లు ఈడి గుర్తింపు.. అక్రమంగా , బలవంతంగా ఈ ఆస్తులను నయీమ్ తమ కుటుంబసభ్యులపేర్ల మీదరిజిస్టర్ చేసుకున్నట్లు గుర్తింపు.. 2022 మార్చిలో నయీమ్ ఆస్తులపై మనీ లాండరింగ్ కేసు నమోదు చేసిన ఈడి.. అప్పటి ఐటీ అధికారులు, సిట్ సమాచారంతో నమోదు చేసినఈడి.. ఆస్తులు మొత్తాన్ని నయీమ్ కుటుంబ సభ్యులు హసీనా బేగం,తహీరా బేగం, సలీమా బేగం,సలీం,అహేలాబేగం,సయ్యద్‌నిలోఫర్ ,ఫిర్దోస్ అంజూమ్, మహమ్మద్ ఆరిఫ్ ,హసీనా కౌసర్ పేర్ల మీద రిజిస్టర్ చేసినట్లు ఈడి గుర్తింపు.

# కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబం: పీసీసీ చీఫ్



హైదరాబాద్, ఏప్రిల్ 11: ఫార్ములా ఈ రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏదోఒక రోజుఅరెస్ట్ కాక తప్పదని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ..హెచ్‌సీయూ అంశానికి కేటీఆర్ అరెస్ట్‌కులింక్ పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడే మాటలకు చిన్న పిల్లలు సైతంనవ్వుకుంటున్నారన్నారు. పదేండ్ల లో భూ దోపిడి చర్చకు సిద్ధమా?.. దమ్ము ధైర్య ముంటే చర్చకు రండంటూ కేటీఆర్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఈ సందర్భంగా సవాల్ విసిరారు. కరప్షన్‌కి కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ కుటుంబమని ఆయన అభివర్ణించారు. లిక్కర్ స్కాం చేసింది కూడా కేసీఆర్ కుటుంబమేనని ఆయన గుర్తు చేశారు. అడ్డమైన వాళ్లు వచ్చి మాట్లాడుతున్నారని.. ప్రజలకు పీసీసీ చీఫ్ సూచించారు. కేటీఆర్ ఇంతగా దిగజారుతాడా? అంటూ సందేహం వ్యక్తం చేశారు. కేసీఆర్ కుటుంబంపై సీబీఐతో విచారణ జరపాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

# చందానగర్ ఇన్స్పెక్టర్ గా సుంకరి విజయ్




శేరిలింగంపల్లి, మహానది న్యూస్,ఏప్రిల్ 11: చందానగర్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ గా సుంకరి విజయ్ నియమితు లయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సుంకరి విజయ్ ని చందానగర్ ఇన్స్పెక్టర్ గా బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.
అదేవిధంగా ఇక్కడ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న పాలవెల్లి సైబరాబాద్ క్రైమ్స్ విభాగానికి బదిలీ అయ్యారు. కాగా సుంకరి విజయ్ గురువారం సాయంత్రం పాలవెల్లి నుంచిచార్జ్ తీసుకున్నారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ..చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో పలు వురు నాయకులు పాళవెల్లికి వీడ్కోలు, విజయ్ కి స్వాగతం పలికారు.

## సాక్షి ఎడిటర్ సహా..ఆరుగురు జర్నలిస్టులపై

# అక్రమ కేసులు ఎత్తివేయాలి

### - ఏపీ ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్


హైదరాబాద్,మహానది బ్యూరో, ఏప్రిల్ 11: సాక్షి దినపత్రిక సంపాదకులు ధనంజయరెడ్డితో సహా పల్నాడు జిల్లాకు చెందిన ఆరుగురు జర్నలిస్టులపై ఏపీ ప్రభుత్వం అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య, ఉపాధ్యక్షులు పిల్లి రాంచందర్, కార్యదర్శి ఇ. చంద్రశేఖర్, ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్ డబ్ల్యూజే) జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీబీజేఏ) రాష్ట్ర అధ్యక్షురాలు పి.రాధిక, ప్రధాన కార్యదర్శి జ్యోతిబసు తదితరులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మాచర్ల మండలంలో జరిగిన పి హరిశ్చంద్ర అనే వ్యక్తి హత్య కేసు ప్రచురణ వార్త కారణంగా సమాజంలో వైషమ్యాలు పెచ్చరిల్లుతాయనే సాకుతో జర్నలిస్టులపై కేసు బనాయించడం సరికాదని పేర్కొన్నారు. నిందితులను పట్టుకుని శిక్షించాల్సిన పోలీసులు ఆ పనికి బదులుగా ఈ తరహా కేసులు పెట్టడం అన్యాయమని వారు ఖండించారు. ప్రచురితమైన సమాచారంలో తప్పులుంటే వాటిని సవరించుకునేందుకు వివిధ మార్గాలున్నాయని గుర్తు చేశారు. ఇంకా అభ్యంతరాలు ఉంటే ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కు ఫిర్యాదు చేసుకోవచ్చని వివరించారు.
ఆ అవకాశాలను వదిలేసి మీడియాను, జర్నలిస్టులను భయభ్రాంతులకు గురి చేసేలా పోలీసులు అక్రమ కేసులు పెట్టడం సరైంది కాదనిఅన్నారు. సాక్షి సంపాదకులు ధనంజయ రెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని, అందుకు ఏపీ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

# నర్సరీ ఫీజు రూ. 3.2 లక్షలు..!?

## విద్య వ్యాపారమౌతోందా..?

### - పేద విద్యార్థులకు చదువు అందని ద్రాక్షేనా?

### - సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న పాఠశాల ఫీజు రశీదు..!



New Admissions
(Academic Year 2025-2026)

CLASS: NURSERY

| Fee Heads | Reg. / Admn. I Instl | June II Instl | Sept III Instl | Dec IV Instl | Yearly Total |
|---|---|---|---|---|---|
| Tuition Fee | 47750.00 | 47750.00 | 47750.00 | 47750.00 | 191000.00 |
| Admission Fee | 5000.00 | - | - | - | 5000.00 |
| Initiation Fee | 11250.00 | 11250.00 | 11250.00 | 11250.00 | 45000.00 |
| Caution Deposit (Refundable) | 10000.00 | - | - | - | 10000.00 |
| Total: Rs. | 74000.00 | 59000.00 | 59000.00 | 59000.00 | 251000.00 |

CLASS: PPI & PPII

| Fee Heads | Reg. / Admn. I Instl | June II Instl | Sept III Instl | Dec IV Instl | Yearly Total |
|---|---|---|---|---|---|
| Tuition Fee | 53100.00 | 53100.00 | 53100.00 | 53100.00 | 212400.00 |
| Admission Fee | 5000.00 | - | - | - | 5000.00 |
| Initiation Fee | 11250.00 | 11250.00 | 11250.00 | 11250.00 | 45000.00 |
| Caution Deposit (Refundable) | 10000.00 | - | - | - | 10000.00 |
| Total: Rs. | 79350.00 | 64350.00 | 64350.00 | 64350.00 | 272400.00 |

CLASS: I & II

| Fee Heads | Reg. / Admn. I Instl | June II Instl | Sept III Instl | Dec IV Instl | Yearly Total |
|---|---|---|---|---|---|
| Tuition Fee | 57865.00 | 57865.00 | 57865.00 | 57865.00 | 231460.00 |
| Admission Fee | 5000.00 | - | - | - | 5000.00 |
| Initiation Fee | 11250.00 | 11250.00 | 11250.00 | 11250.00 | 45000.00 |
| Caution Deposit (Refundable) | 10000.00 | - | - | - | 10000.00 |
| Total: Rs. | 84115.00 | 69115.00 | 69115.00 | 69115.00 | 291460.00 |

CLASS: III to V

| Fee Heads | Reg. / Admn. I Instl | June II Instl | Sept III Instl | Dec IV Instl | Yearly Total |
|---|---|---|---|---|---|
| Tuition Fee | 65590.00 | 65590.00 | 65590.00 | 65580.00 | 262350.00 |
| Admission Fee | 5000.00 | - | - | - | 5000.00 |
| Initiation Fee | 11250.00 | 11250.00 | 11250.00 | 11250.00 | 45000.00 |
| Caution Deposit (Refundable) | 10000.00 | - | - | - | 10000.00 |
| Total: Rs. | 91840.00 | 76840.00 | 76840.00 | 76830.00 | 322350.00 |

**హైదరాబాద్,మహానది, ఎడ్యుకేషన్ డెస్క్ 11:** నగరంలో ఓనర్సరీ పాఠశాల విద్యార్థి నుంచి ఏకంగా రూ. 3 లక్షల 20 వేలకు పైగా ఫీజు వసూలు చేసినట్లుగా బయటకు వచ్చిన ఒక రసీదు ఇప్పుడు విద్యా రంగంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అయితే. ఈ రసీదుపై పాఠశాల పేరు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. ఇంత భారీ స్థాయిలో నర్సరీ విద్యకు ఫీజులు వసూలు చేస్తుండటం విద్యా వ్యవస్థ భవిష్యత్తుపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఈ తరహా ఫీజులు నిజంగా విద్యా వ్యాపారీకరణకు దారి తీస్తున్నాయా? డబ్బున్నోడికే ప్రైవేటు చదువులు అనే నిస్తేజమైన భావన బలపడితే సమాజంలో పరిస్థితులు మరింత దిగజారే ప్రమాదం లేదా? ఒక నర్సరీ విద్యార్థికి ఏ ప్రైవేటు పాఠశాలలో ఇంత భారీగా ఫీజులు ఎలా సమర్థనీయం? పాఠశాలలు అందిస్తున్న ప్రత్యేక సౌకర్యాలు ఏమిటి? సామాన్యులు తమ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడం కలగానే మిగిలిపోతుందా? ఇలాంటి పాఠశాలలపై ప్రభుత్వాలు ఎందుకు నిఘా పెట్టడం లేదు? ఇంతటి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి లేదా? పాఠశాల పేరు లేకుండా రసీదులు ఇస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు? మరోవైపు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఈ విషయంలో బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది కదా? పాఠశాల పేరులేని రసీదులను వారు ఎందుకు ప్రశ్నించడం లేదు అధిక ఫీజుల గురించి నిలదీసేందుకు ఎందుకు వెనుకాడుతు న్నారు? తల్లిదండ్రు ల ఆసక్తి,నిర్లక్ష్యం ఈ తరహా విద్యా మాఫియా రెచ్చిపోవడానికి కారణమవుతోందా? వంటిఅనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభు త్వాలు తక్షణమే స్పందించి ఇలాంటి అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. పా రదర్శకమైన ఫీజుల విధానాన్ని అమలు చేయడంతో పాటు, నిబం ధనలు ఉల్లంఘించే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులో ఉండేలాచర్యలు చేపట్టాలి. లేకపోతే, విద్యకేవలం కొందరికే పరిమి తమై, సమాజంలో అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది. ఈ విద్యా దోపిడీకి అడ్డుకట్ట ఎప్పుడు పడుతుందో వేచి చూడాలి.

# కాంగ్రెస్ లో ఈగిల్ గ్రూప్!



న్యూఢిల్లీ, ,: ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఈగిల్ గ్రూప్‌ను ఏర్పాటు చేసింది. 8 మంది ముఖ్య నాయకులు, నిపుణులతో కూడిన ఈ గ్రూపులో అజయ్ మాకెన్, దిగ్విజయ్ సింగ్, అభిషేక్ సింఘ్వీ, పవన్ ఖేడాతో సహా పలువురు ముఖ్య నేతలను కాంగ్రెస్ చేర్చుకుంది. పార్టీకి చెందిన ఈగల్ బృందం మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో జరిగిన అక్రమాలపై పోస్ట్‌మార్టమ్ చేసి సవివరమైన నివేదికను సిద్ధం చేసి పార్టీ హైకమాండ్‌కు సమర్పించనుంది.భారత ఎన్నికల సంఘం స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణను పర్యవేక్షించేందుకు తక్షణమే అమల్లోకి వచ్చేలా నాయకులు, నిపుణులతో కూడిన సాధికారిక కార్యవర్గాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ఏర్పాటు చేశారని పార్టీ జారీ చేసిన లేఖలో పేర్కొంది. ఈ కమిటీ మొదట మహారాష్ట్ర ఓటర్ల జాబితాలో అవకతవకలను గుర్తించనుంది. వీలైనంత త్వరగా హైకమాండ్‌కు సమగ్ర నివేదికను సమర్పించనుంది.దీంతో పాటు ఇతర రాష్ట్రాల్లో గతంలో జరిగిన ఎన్నికలను కూడా ఈగిల్ విశ్లేషించి రానున్న ఎన్నికలను, దేశంలో నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను చురుగ్గా పర్యవేక్షించి నివేదికలు సిద్ధం చేసి హైకమాండ్‌కు పంపనుంది. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేశారు. దీనిపై ఎన్నికల సంఘం కూడా స్పందించింది.

**ఈ 8 మందికి గ్రూప్‌లో చోటు:** అజయ్ మాకెన్, దిగ్విజయ్ సింగ్, అభిషేక్ సింఘ్వీ, ప్రవీణ్ చక్రవర్తి, పవన్ ఖేడా, గుర్దీప్ సింగ్ సప్పల్, నితిన్ రౌత్, చల్లా వంశీ చంద్ రెడ్డి గతేడాది చివర్లో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల్లో ఒకవైపు బీజేపీ, షిండే గ్రూపునకు చెందిన శివసేన, అజిత్ పవార్ గ్రూపునకు చెందిన ఎన్సీపీతో కూడిన అధికార కూటమి ఉంది. మరో వైపు మహావికాస్ అఘాడి బరిలో నిలిచింది. ఇందులో కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన, శరద్ పవార్ కు చెందిన ఔఅఖ ఉన్నాయి. ఎన్నికల ఫలితాల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించడం, దాని మిత్రపక్షాలు ఎన్నికల్లో విజయం సాధించడంతో గెలుపుపై ఆశలు పెట్టుకున్న ప్రత్యర్థులు షాక్‌కు గురయ్యారు. ఎన్నికల తర్వాత ప్రతిపక్షాలన్నీ 50 సీట్ల మార్కును కూడా చేరుకోలేకపోయాయి. చాలా స్థానాల్లో ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని గతంలో కాంగ్రెస్ కూడా ఈవీఎంలపై ప్రశ్నలు సంధించింది. అయితే ఈ ఆరోపణలన్నింటిపై ఎన్నికల సంఘం ఒక్కొక్కటిగా స్పందిస్తూ.. పార్టీకి సలహాలు కూడా ఇచ్చింది. ప్రస్తుతం ఢిల్లీలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. న ఓటింగ్, ఫిబ్రవరి 8న ఫలితాలు వెల్లడికానున్నాయి. అందుకే ఫలితాలకు ముందే పార్టీ ఈగిల్ గ్రూప్‌ని ఏర్పాటు చేసింది.

# జిహెచ్ఎంసి సిమ్మింగ్ పూల్ ను సద్వినియోగం చేసుకోండి -కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



ఎల్బీనగర్, మహానది న్యూస్, ఏప్రిల్ 11:
బియన్ రెడ్డి నగర్ డివిజన్ లోని సచివాలయ నగర్ జిహెచ్ఎంసి స్విమ్మింగ్ పూల్ ను బియన్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, స్విమ్మింగ్ చేయడం ద్వారా శరీరానికి ఎంతో వ్యాయామం వస్తుందని, ఈ వేసవికాలంలో జిహెచ్ఎంసి సిమ్మింగ్ పూల్ ను సద్వినియోగం చేసుకోవాలని పరిసర ప్రాంత ప్రజలను కోరారు. సిమ్మింగ్ కి వచ్చే వాళ్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్విమ్మింగ్ పూల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

## ఆత్మ గౌరవంతో బతకాలని

# పోరు చేసిన మహాత్మా పూలే

### -జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ

హైదరాబాద్, మహానది న్యూస్, ఏప్రిల్ 11: ప్రతి మనిషిని గౌరవించాలని, ప్రతి మనిషీ తాను ఆత్మ గౌరవంతో జీవించాలని ప్రభోదిస్తూ ఆ హక్కుల పరిరక్షణ కోసం, వాటిని అడ్డగించే దుష్టులపై జీవిత కాలం యుద్ధం చేసిన మహాత్ముడు జ్యోతి రావు పూలే అని, వారు చూపిన మార్గంలో ఈ సమాజం పయనించి లోక కల్యాణానికి పాటు పడాలని జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ పేర్కొన్నారు. జ్యోతి రావు పూలే జయంతి సందర్భంగా కేఎస్ఆర్ గౌడ వారికి ఘన నివాళులర్పించారు. మహ నీయుల జయంతులు, వర్ధంతుల సందర్భంగా సభలు, సమావేశాలు నిర్వహించడం,



పూల మాలలు అలంకరించడం, విగ్రహాలు ఏర్పాటు చేయడం, వారి గొప్పతనాన్ని కీర్తించడంతో పాటు తమ జీవితంలో వారి పోరాట స్ఫూర్తిని ఆచరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తే వ్యవస్థలో పరివర్తన చాలా వేగంగా జరుగుతుందని ఆయన అభిలషించారు. వ్యక్తిగత పద్ధతి వ్యక్తికి, కుటుంబ ఆచారాలను కుటుంబానికి, సమూహ విధానాలు సమూహానికి పరిమితం చేస్తూ తనను తాను గౌరవించుకుంటూ, ఇతరులను ప్రేమించడమే ఆధునిక మానవుడు మహనీయులకు ఇచ్చే నిజమైన నివాళి అని జై స్వరాజ్ పార్టీ అధినేత కేఎస్ఆర్ గౌడ అన్నారు.

# పైన పటారం... లోన లొటారం?

హైదరాబాద్: బీఆర్ఎస్.. తెలంగాణలో పదేళ్లు అధికారంలో ఉన్న పార్టీ. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ప్రతిపక్షానికి పరిమితం చేశారు. అధికారం అనుభవించినంతకాలం కలిసి ఉన్న నేతలు ఇప్పుడు ఎవరికి వారు అన్నట్లు వ్యవహరిస్తున్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. బావా, బావ మరుదులు అయిన హరీశ్‌రావు, కేటీఆర్ మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. కవిత తనదారి తాను చూసుకుంటోంది. తెలంగాణ ఉద్యమ పార్టీగా బీఆర్ఎస్‌కు రాష్ట్రంలో ఇప్పటికీ మంచి గుర్తింపు ఉంది. ఆ పార్టీ కూడా ఆ సెంటిమెంటునే అడ్డం పెట్టుకుని రాజకీయం చేస్తున్నాయి. కష్టం వచ్చిన ప్రతీసారి ఆ పార్టీ నేతలకు జై తెలంగాణ నినాదం గుర్తొస్తుంది. ఇక ఎంత సెంటుమెంటు రాజకీయాలు చేసినా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీకి పరాభవం తప్పలేదు. ఓటమికి అనేక కారాణాలు ఉన్నాయి. అధికారంలో ఉన్ననన్ని రోజులు అందరూ కేసీఆర్ మాటకు కట్టుబడి పనిచేశారు. కాదు చేసినట్లు నటించారు. అధికారం పోగానే ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇప్పుడు పార్టీలో కీలక స్థానాల్లో ఉన్న కేటీఆర్, హరీశ్‌రావు మధ్య కూడా పొసగడం లేదని తెలుస్తోంది. ఓటమి తర్వాత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమ య్యారు. ఇక కవిత తన సొంత జిల్లా నిజామాబాద్ రాజకీయాలపై దృష్టి పెడుతున్నారు. ఈ తరుణంలో కేటీఆర్, హరీశ్‌రావు ఎవరికి వారు అన్నట్లుగా కార్యక్రమాలు నిర్వహించడం పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. కేడర్ మద్దతు కోసం ఒకరిని మించి ఒకరు రాజకీయం చేస్తున్నారు. ఇప్పటికే పలు సందర్భాల్లో పోటీపోటీ కార్యక్రమాలు నిర్వహించి పార్టీలో కొత్త చర్చకు దారితీశారుఅధికారం కోల్పొయి డీలా పడిన కారు పార్టీకి మరమ్మతులు చేయాల్సిన గులాబీ అధినేత కేసీఆర్.. పట్టించుకోవడం మానేశారు. ప్రతిపక్ష నేతగా ప్రజా సమస్యలపై పోరాడాల్సిన ఆయన.. ఓడించిన ప్రజలతో మాకేం పని అన్నట్లు దూరంగా ఉంటున్నారు. అడపాదడపా ఫాంహౌస్‌కు తనను కలిసేందుకు వచ్చేవారితో మీటింగ్‌లు పెడుతూ టైంపాస్ చేస్తున్నారు. ఇక అసెంబ్లీలో బీఆర్ఎస్ బరువు, బాధ్యతలు మోస్తున్న కేటీఆర్, హరీశ్‌రావు ఇప్పుడు పోటా పోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీ క్యాడర్‌ను తమవైపు తిప్పుకోవడానికి పోటీ పడుతున్నారు. దీంతో ఎటు వెళ్లాలో తెలియక కార్యకర్తలు సతమతమవుతున్నారు.పదవీకాలం ముగిసిన మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లను ఇటీవల గులాబీ నేతలు సత్కరించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ హాజరవుతారని అంతా భావించారు. తీరా చూస్తే కేటీఆర్ ఒక్కరే వచ్చారు. తాజాగా అంబేద్కర్ విగ్రహాలను వేర్వేరుగా ఇద్దరూ ఒకేరోజు ఆవిష్కరించడం చర్చనీయాంశమైంది. సిద్దిపేట జిల్లా రంగదాంపల్లిలో అంబేద్కర్ విగ్రహాన్ని హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఒకేరోజు ఇద్దరు వేర్వేరుగా ఆవిష్కరించడం తెలంగాణలో వైరల్‌గా మారింది. బీఆర్ఎస్‌లో అనైక్యత ఇప్పుడు కోల్డ్ వార్‌ను బయట పెడుతున్నాయి.గులాబీలో కీలక నేతలు అయిన కేటీఆర్, హరీశ్‌రావు మధ్య ఎప్పటి నుంచో కోల్డ్‌వార్ జరుగుతోంది. కానీ, పైకి ఐక్యతారాగం జపిస్తున్నాన్న వాదనలు ఉన్నాయి. అధికారంలో ఉన్నప్పుడు కలిసి ఉండకుంటే బాగుండదు అన్నట్లుగా ఉన్నారు.కానీ ఇప్పుడు ఎవరిదారి వారు చూసుకుంటున్నట్లు వారు నిర్వహిస్తున్న కార్యక్రమాలు చూస్తే అర్థమవుతోంది. ఇద్దరి నేతల తీరుతలో కేడర్‌లో అయోమయం నెలకొంది

## అక్రమ వ్యాపారులకు అడ్డాగా సూర్యాపేట వ్యవసాయ మార్కెట్..?

సూర్యాపేట : సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ రోజు రోజుకి అక్రమ అడ్డగా మారుతుంది. ఐకేపీలో మిల్లు కు కేటాయించిన ధాన్యం మళ్లీ మార్కెట్ లో విక్రయించేందుకు తరలించారు. ధాన్యం బస్తా కూడా ప్రభుత్వం కేటాయించిన 35 కిలోల బస్తా లో తీసుకురావడం విశేషం. ఈ ధాన్యం ఖమ్మం లో మిర్చి వ్యాపారం చేస్తూ రెండుసార్లు రైతులకు డబ్బులు ఇవ్వకుండా ఐపీ పెట్టిన గడ్డి పల్లి కి చెందిన ఓ మిల్లు యజమాని ధాన్యం గా చెందిన అనుమానం.

# ఆస్తి పన్ను వసూళ్లలో జిహెచ్ఎంసి చందానగర్ సర్కిల్ నాలుగో స్థానం




**శేరిలింగంపల్లి,మహానది న్యూస్,ఏప్రిల్ 11:** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ ఎంసీ) లో 2024-25 సంవత్సరానికి గాను ఆస్థి పన్ను వసూలులో రికార్డు స్థాయిలో వసూలైన సందర్భంగా జిహెచ్ఎంసి రెవెన్యూ విభాగానికి (30 సర్కిళ్లకు) సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో చందానగర్ సర్కిల్-21 నాలుగవ స్థానం వచ్చినందున చందానగర్ సర్కిల్ రెవెన్యూ విభాగానికి సన్మానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఉప కమీషనర్ పి. మోహన్ రెడ్డి మాట్లాడుతూ, 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 109.54 కోట్ల ఆస్తి పన్ను వసూలైనట్లు తెలిపారు. అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు మొత్తం బృందం సమిష్టి కృషి వల్ల ఈ ఘనత సాధించగలిగామని తెలిపారు. చందానగర్ రెవిన్యూ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు.
ఈ కార్యక్రమంలో సర్కిల్ రెవెన్యూ విభాగం ఏఎంసీలు, టాక్స్ ఇన్స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.ఎర్లీ బర్డ్ స్కీం ద్వారా ఆస్తి పన్ను ఏప్రిల్ 30వ తేదీ లోగా చెల్లిస్తే 5 శాతం రాయితీ పొందే అవకాశం ఉందని, ఏప్రిల్ 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఎర్లీ బర్డ్ స్కీం అందుబాటులో ఉందని, కేవలం 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుకు మాత్రమే ఎర్లీ బర్డ్ స్కీం వర్తింస్తుందని తెలిపారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై ఎర్లీ బర్డ్ స్కీం వర్తించదని ఉప కమీషనర్ తెలిపారు. శనివారం, ఆదివారం, సోమవారం, ఏప్రిల్ నెలలోని అన్ని సెలవు రోజులలో బిల్ కలెక్టర్ అందుబాటులో ఉంటారని, సర్కిల్ ఆఫీస్ సిటిజన్ సర్వీస్ సెంటర్ కూడా అందుబాటులో ఉంటుందని, ఫోన్ పే, గూగుల్ పే, క్రెడిట్ కార్డ్, మీ సేవా సెంటర్ల లో ఆస్థి పన్ను చెల్లించుకోవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా చందానగర్ సర్కిల్ ప్రజలకు ఉప కమీషనర్ మోహన్ రెడ్డి కోరడమైనది.

# సంపాదకీయం

## సామూహిక మరణాలను ఆపాల్సిందే

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్థానమవుతుంది. అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించేవారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు. కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి. వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి. గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదలుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే. మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం. మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు. 2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం. ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి. కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది. వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపో వడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం. గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో అధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి. వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చనే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

# జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్

- మేం పాలకుల పక్షం కాదు.. పాత్రికేయుల పక్షమే
- రాష్ట్రవ్యాప్తంగా నెంబర్ వన్ స్థానంలో నిలవాలి
- రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి బసవపునయ్య
- రంగారెడ్డి జిల్లాలో భారీగా సభ్యత్వ నమోదు
- ఫెడరేషన్ లో చేరిన వివిధ యూనియన్ల నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



సభ్యత్వం అందజేస్తున్న ఫెడరేషన్ రాష్ట్ర నేతలు



ఫెడరేషన్ లో చేరిన రంగారెడ్డి జిల్లా జర్నలిస్టులు

**రంగారెడ్డి, మహానది బ్యూరో, ఏప్రిల్ 11:** రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉండేందుకు ప్రత్యామ్నాయ ట్రేడ్ యూనియన్ గా ఏర్పడిన ఫెడరేషన్ జర్నలిస్టుల ఆదరణతో నెంబర్ వన్ యూనియన్ గా బలపడిందని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం, వివిధ యూనియన్ల నేతల చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు, ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం లేదని, మరోవైపు దాడులు, అవమానాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్ధవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రధాన జర్నలిస్టు యూనియన్లు జర్నలిస్టుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు.

ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు తగ్గింపు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సి వుందని అన్నారు. హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ నిర్వహించబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి జగదీష్, జిల్లా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ లో చేరిన 200 మంది జర్నలిస్టులు

రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీఎస్ యూడబ్ల్యూజే–ఐజేయూ అనుబంధం), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే–143) యూనియన్ లకు చెందిన దాదాపు రెండు వందల మంది జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు.


సూర్య దినపత్రిక జిల్లా బ్యూరో రిపోర్టర్ గణేష్, వార్త జిల్లా బ్యూరో రఘుపతి, సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శ్రీశైలం, దిశ జిల్లా బ్యూరో సురేష్ తదితరులతో పాటు వివిధ పత్రికలకు చెందిన రెండు వందల మంది జర్నలిస్టులు ఆయా జర్నలిస్టు యూనియన్లకు రాజీనామా చేసి ఫెడరేషన్ లో చేరారు. వీరందరికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి ఆహ్వానించారు.

# చల్లటి బీరులో చెత్త...!



కరీంనగర్ : కూల్ కూల్ బీరు అందుకున్నాడు. ఫ్రెండ్స్ తో కూర్చున్నాడు. సినిమా స్టైల్ లో బీరు సీసా ఓపెన్ చేశాడు. ఇంకేముంది అతని నాలుక రపరపమంది. ఒక చుక్క గొంతులో వేసుకున్నాడు. ఏదో టేస్ట్ తేడాగా ఉండడంతో, మళ్లీ సీసాలో చూశాడు, ఇంకేముంది పరుగుపరుగున వైన్స్ షాప్ వద్దకు చేరుకున్నాడు. పాపం అంతలోనే ఏం జరిగిందని అనుకుంటున్నారా.. అయితే ఈ కథనం చదవాల్సిందే. ఓ యువకుడు ఆశగా బీరు సీసా కొనుగోలు చేసి చివరకు ఖంగుతిని, ఏకంగా ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసేవరకు వెళ్లాడు. అంతలా ఆ బీరు ప్రియుడికి కోపం రావడానికి పెద్ద కారణమే ఉంది. అయితే సదరు వైన్స్ షాపు యజమాని ఇచ్చిన సమాధానంతో ఆగ్రహం వ్యక్తం చేసిన యువకుడు ఫిర్యాదు వరకు వెళ్లాడు. ఎట్టకేలకు అధికారులు కూడ ఆ బీరులోని కాస్త సేకరించి శాంపిల్స్ కు పంపించేందుకు సిద్ధమవుతున్నారు పెద్దపల్లి జిల్లా రంగం పల్లి లోని శ్రీ వెంకటేశ్వర వైన్స్ లో శ్రీనివాస్ అనే యువకుడు బీరు కొనుగోలు చేశాడు. స్నేహితులతో కలిసి తాగేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే బీరు లో ఉన్న చెత్తను గమనించి షాక్ కు గురయ్యాడు. అప్పటికే కొంత బీరు తాగిన యువకుడు స్థానిక వైన్స్ షాపు నిర్వాహకులను నిలదీశాడు. తమకు సంబంధం లేదని యాజమాని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారట. దీంతో శ్రీనివాస్, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు. శాంపిల్ సేకరించి ల్యాబ్ పంపుతామని ఎక్సైజ్ అధికారులు తెలిపినట్లు సమాచారం. జిల్లాలో తరుచూ ఇలాంటి ఘటనలే చోటు చేసుకుంటుండగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియులు డిమాండ్ చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఇటీవల ఇలాంటి ఫిర్యాదులు కోకొల్లలు వస్తున్నాయని బీరు ప్రియులు ఆరోపిస్తున్నారు. మరి తయారీలో తేడా జరుగుతోందా? లేక మరెక్కడైనా తప్పు జరుగుతుందా అన్నది ఎక్సైజ్ శాఖ అధికారులు తేల్చాల్సి ఉంది.

# ఫ్రస్టేషన్‌లో మావోయిస్టులు?



వరంగల్: గత కొన్ని నెలలుగా తగులుతున్న ఎదురు దెబ్బలకు మావోయిస్టులు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయారు. ఒక విధంగా చెప్పాలంటే ఏం చేయాలో అర్థంకాని స్థితి లోకి వెళ్లిపోయారు. ఆ ఫ్రస్టేషన్ గత కొన్ని నెలలుగా సామాన్యులపై తీర్చుకుంటున్నారు. మావోయిస్టుల ఇన్‌ఫర్మేషన్ పోలీసులకు అందిస్తున్నారని అనుమానిస్తున్నారు. అందుకే అనుమానం ఉన్న వారందర్నీ కాల్చి చంపుతున్నారు. తాజాగా మావోయిస్టులు మరోసారి ఇన్‌ఫార్మర్ నెపంతో ఇద్దరు గిరిజనులను హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని టార్రెమ్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ దుర్ఘటన జరిగింది. తమ వారిని చంపేందుకు వీళ్లు సహకరిస్తున్నారని మావోయిస్టులు ఈ హత్యలకు తెగపడ్డారు. తలాబ్ పారా బుడ్డి ప్రాంతంలో నివాసముండే కరమ్ రాజు (32), మద్వి మున్నా (27) అనే ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. వీళ్లే తమ పార్టీకి చెందిన నేతలు ఉండే ప్రాంతాల సమాచారాన్ని పోలీసులకు అందిస్తున్నారనే నెపంతో ఈ దురాఘతానికి పాల్పడ్డారు. మద్వి మున్నా, కరమ్ రాజు ఇళ్లలోకి అర్ధరాత్రి చొరబడి మావోయిస్టులు పదునైన ఆయుద్ధాలతో అతి కిరతకంగా గొంతు కోసి హత్య చేశారు. కుటుంబం సభ్యుల ముందే మావోయిస్టులు ఈ దారుణానికి పాల్పడ్డారు. తమ వారికి ఏ పాపం తెలియదు వదిలి పెట్టాలని వేడుకున్నా విడిచిపెట్టలేదు. వారు కాళ్లావేళ్ల పడినా కనికరించలేదు. హత్యలు చేసిన తర్వాత మావోయిస్టులు స్పాట్‌లో లేఖలు విడిచి పెట్టి వెళ్లారు. ఈ ఘటనతో బీజాపూర్ ఏజెన్సీ ప్రాంతం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. గిరిజనుల హత్యను పోలీసులు కూడా ధృవీకరించారు. ఘటనపై టార్రెమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. 2రోజుల వ్యవధిలోనే మావోయిస్టులు పోలీస్ ఇన్ ఫార్మర్ నెపంతో ముగ్గురిని హత్య చేశారు. ఆదివారం తెల్లవారు జామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా బహదూర్ ఘాట్ తాలుకలో మాజీ ఎంపిటీసీ మాడవ్వి (45) ని ఇలానే దారుణంగా హత్య చేశారు మావోయిస్టులు. పోలీస్ ఇన్ ఫార్మర్‌గా మారి దళాల సమాచారాన్ని పోలీస్‌కు అందిస్తున్నారని నెపంతో మాడవ్వి చితకబాది హత్య చేశారు. వరుస ఘటనలతో ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర దండకారణ్యంలో గిరిజన గూడేలు భయంతో వనికి పోతున్నాయి. వరుస ఎన్‌కౌంటర్లలో మావోయిస్టులు పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారు. దీనికి దళాల సమాచారం పోలీస్‌లకు లీక్ కావడమే కారణమని మావోయిస్టులు భావిస్తున్నారు. అందుకే ఇలా ఊళ్లపై పడి హత్యలకు పాల్పడుతున్నారు. ఈ భయంతోనైనా ప్రజలు తమ సమాచారాన్ని పోలీసులకు ఇవ్వకుండా ఉంటారని అనుకుంటున్నారు

## ఇతనెవరో గుర్తుపట్టారా..?



**ఈ ఫోటోలో ఉన్న ఇతనెవరో గుర్తుపట్టారా? అదేనండి మన మాస్ మల్లన్న. మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి. విద్యా సంస్థల అధినేత, ప్రస్తుత ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎప్పుడూ ఒక ఇన్‌స్పిరేషన్ ఇస్తూనే ఉంటారు. సందర్భాన్ని బట్టి ఎలాంటి భేషజాలకు పోకుండా ఎంజాయ్ చేస్తుంటారు. ఏ ఎండకు ఆ గొడుగు అన్నట్టు తప్పుగా అనుకోకండి. జీవితంలో ఎన్ని కష్టాలు పడి పైకొచ్చారో, అంతే స్థాయిలో ఎప్పుడూ హుషారుగా, సరదాగా ఉంటారు. ఎంజాయ్ చేస్తుంటారు. బతికితే ఇలా బతకాలిరా అనిపిస్తారు. చూడండి... కుటుంబ సభ్యులతో కలిసి జపాన్ పర్యటనలో వున్న మల్లారెడ్డి దంపతులు సరదాగా ఇలా జపనీయుల సంప్రదాయ దుస్తులు ధరించి ఫోటోకు పోజులిచ్చారు. తగ్గేదేలా అంతే మా మల్లారెడ్డి సార్.**

# నిరుపయోగంగా అశ్వాపురం బస్టాండ్!

### ఎండలో మగ్గుతున్న ప్రయాణికులు..!

### పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు..?

భద్రాద్రి కొత్తగూడెం: కర్నే బాబురావు భద్రాది కొత్తగూడెం జిల్లా అశ్వాపురం బస్టాండ్ ఎందుకు వినియోగంలోకి తీసుకురావడంలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అసమర్థత, నిర్లక్ష్యమా, మాకేందుకులే ఆలోచన ధోరణి కారణమా అని విమర్శిస్తున్నారు. రూ.లక్షల ప్రజాధనంతో నిర్మించిన బస్టాండ్ నిరూపయోగంగా ఉందని, ప్రధాన రహదారిపై ఎండలోనే ఉండవలసి వస్తుందని అధికారులకు ప్రజా ప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# పంచాయతీల్లో స్వచ్ఛత ఏదీ?



పుట్టపర్తి:పల్లెసీమలు పరిశుభ్రంగా ఉండాన్న లక్ష్యంతో స్వచ్ఛభారత్ కింద వాహనాలను పంచాయతీలకు కేటాయించారు. గత ప్రభుత్వం నిర్వహణలో నిర్లక్ష్యం, చిత్తశుద్ధి లేకపోవడంతో స్వచ్ఛ వాహనాలు మూలకు చేరాయి. దీంతో చాలా చోట్ల చెత్తసేకరణ ప్రక్రియ ఆగిపోయింది. వీధులు అపరిశుభ్రతగా మారి, రహదారులపైన చెత్తదిబ్బల దర్శనమిస్తున్నాయి. రూ.కోట్లు ఖర్చుచేసి పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు స్వచ్ఛభారత్ కింద వాహనాలు ఇచ్చారు. నిర్వహణతోపాటు కార్మికులకు వేతనాలు ఇవ్వక మూలనపడ్డాయి. కనీసం మరమ్మతులు చేయించకపోవడంతో వాహనాలు తుప్పుపట్టాయి. కొన్ని విడిభాగాలు అపహరణకు గురయ్యాయి. జిల్లాలో ఆరు ఆటోలు, 25 ట్రాక్టర్లు, 310 రిక్షాలు మరమ్మతులకు గురికావడంతో ఆపేశారు. వీటికితోడు వాహనాలను నడిపేందుకు 15మంది డ్రైవర్ల కొరత ఉంది. మేజర్ పంచాయతీ తలుపులలో రెండు ట్రాక్టర్లు, ఆటో, పది రిక్షాలు ఉన్నాయి. వాటిలో ఐదు ఆటోలను మూలనపెట్టారు. దీంతో అవి తుప్పుపడుతున్నాయి. మురుగు కాల్వల్లో పూడిక తొలగించే మినీ జేసీబీ నిరుపయోగంగా మారింది. రూ.లక్షల విలువైన జేసీబీని ఆరుబయట పడేశారు. ఫలితంగా పారిశుద్ధ్యం అధ్వానంగా తయారైంది. కదిరి గ్రామీణం: కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి, పట్నంలో ఆటోలు మరమ్మతులకు వచ్చాయి. కుమ్మవాండ్లపల్లిలో ఆటో బ్యాటరీ అపహరణకు గురైంది. మొటుకుపల్లి, కాళసముద్రం డ్రైవర్లు లేక నిలిపేశారు. మండలంలోని 36 రిక్షాల్లో సగానికి పైగా మూలన పడేశారు. కొత్తగా మంజూరైన వాహనాలను వినియోగించకుండానే తుప్పుపడుతున్నాయి. దీంతో రోడ్లపై చెత్త, వీధుల్లోకి మురుగు చేరుతోంది. పలు పంచాయతీల్లో చెత్తసేకరణ వాహనాల్లో కొన్ని పని చేయడంలేదు. కొన్నింటికి డ్రైవర్ల కొరత ఉంది. మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# అధికార బలం.. అవినీతికి ఊతం

పుట్టపర్తి :గత వైకాపా ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణశాఖ ఏఈ హరిప్రసాద్‌రెడ్డి అవినీతి, అక్రమాలకు అడ్డే లేకుండా పోయింది. ఎందుకంటే ఆయన అవినీతి కార్యాకలాపాల్లో అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు భాగస్వామ్యం ఉంటడమే. ఒక మండలంలో అవినీతికి పాల్పడటం.. మరో మండలానికి బదిలీ కావడం.. ఇలా ఐదేళ్లపాటు ఇష్టారాజ్యంగా ఏఈ వ్యవహరించాడు. జగనన్న కాలనీల్లో గృహాలు నిర్మించకుండానే బిల్లులు స్వాహా అయ్యాయి. అవినీతి ఆరోపణలు బహిర్గతమై ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా విచారణ చేపట్టిన దాఖలాలు లేవు. వైకాపా నాయకుల అండదండలతో ఆయన ఆడిందే ఆట పాడిందే పాటగా కొనసాగింది. పెనుకొండ, నల్లమాడ, కొత్తచెరువు, ఓడీసీ మండలాల్లో హరిప్రసాద్‌రెడ్డి స్వాహాపర్వం యథేచ్ఛగా సాగింది. కొత్తచెరువు మండలంలో 6వేల బస్తాల సిమెంటు స్వాహా చేయడంతోపాటు లబ్ధిదారులకు అందాల్సిన దాదాపు వెయ్యి టన్నుల ఇసుక కూపన్లను పక్కదారి పట్టించిన వైనంపై 'ఇవ్వకున్నా ఇచ్చినట్లు...అంతా కనికట్టు' శీర్షికన 2022, మేలో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పట్లోనే అవినీతి అక్రమాలు వెలుగులోకి వచ్చినా అధికారులు మిన్నకుండిపోవడం గమనార్హం. ఓడీసీ మండలంలో వైకాపా నాయకులు గృహాలు నిర్మించకుండానే బిల్లులు వారి ఖాతాలకు జమ చేసుకుని స్వాహా చేసినట్లు అధికారుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. దాదాపు రూ.1.20 కోట్లు అవినీతి జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. నలుగురు పిల్లలు ఉన్నారు. తాత్కాలిక గుడారంలో తలదాచుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నాలుగేళ్ల క్రితం



అప్పుడున్న ఏఈ ఇల్లు కట్టిస్తానని రూ.60 వేలు తీసుకున్నారు. పునాది వేసి సిమెంటు ఇటుకలు ఇచ్చారు. మూడేళ్లుగా ఏఈ కనిపించలేదు. ఎవరిని అడగాలో తెలియలేదు. గృహ నిర్మాణశాఖ ఏఈ హరిప్రసాద్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాం. ఇటీవల ఓడీసీ మండలంలో జగనన్న కాలనీలోని ఇళ్ల నిర్మాణంలో రూ.1.20 కోట్లు అవినీతికి పాల్పడినట్లు గుర్తించాం. కలెక్టర్ అరుణ్‌బాబుకు నివేదిక అందజేశాం. అతనిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనారోగ్యంతో ఉన్న భర్త, ఆరుగురు పిల్లల పోషణ భారం నాదే. ప్రభుత్వం ఇచ్చే మొత్తానికి అదనంగా ఇస్తే ఇల్లు నిర్మించి ఇస్తామన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.1.20 లక్షలతోపాటు అప్పుచేసి రూ.95 వేలు ఏఈకి ఇచ్చాను. పైకప్పు అయ్యాక ఆచూకీ లేకుండా పోయారు. మిగిలిన ఇంటి పని పూర్తి చేయలేదు.

# అక్రమ క్వారీయింగ్‌పై చర్యలు తీసుకోవాలి

## అధికారులకు ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆదేశం



విజయపురం: మండలంలో గత ప్రభుత్వంలో అక్రమంగా కొండల నుంచి తోడేసిన గ్రావెల్ క్వారీపై సమగ్ర విచారణ నిర్వహించి సంబంధించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో కొండల నుంచి గ్రావెల్ మట్టిని అక్రమంగా ఒక సర్వే నంబరులో అనుమతి తీసుకుని మరోచోట మట్టి తవ్వి అక్రమంగా సరిహద్దున ఉన్న తమిళనాడుకు తరలించి సొమ్ము చేసుకున్నార న్నారు. ఇందుకు అధికారులు వత్తాసు పలికారని, ఇకపై అలాంటి ఆటలు సాగవన్నారు. అక్రమాలపై అధికారులు చర్యలు తీసుకోకుంటే వారిపై చర్యలు తప్పవని, అవసరమైతే క్రిమినల్ కేసులు పెట్టే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఎక్కడ క్వారీ మైనింగ్ సంబంధించిన లారీలు అక్రమంగా తిరిగితే సీజ్ చేయాలన్నారు. మండల పరిషత్ నిధుల దుర్వినియోగంపై ఉన్న ఫిర్యాదులు విచారించి చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య పరిష్కరించాల న్నారు. డీఎస్పీ నరసింహమూర్తి, ఎంపీడీవో బ్రహ్మయ్య, తహసీల్దారు మల్లికార్జునరావు, జడ్పీటీసీ సభ్యురాలు రేవతి, అధికారులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేను తెదేపా శ్రేణులు నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమ క్వారీ, గ్రావెల్ తరలిం పును నిలిపి వేయాలంటూ గ్రామస్థులు, యువత నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని వనదుర్గాపురం పంచాయతీ పరిధి సరిహద్దులో అక్రమంగా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా చేపడుతున్న క్వారీని వెంటనే నిలిపివేయాలని నినదించారు.
వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం నుంచి తమిళనాడుకు చెందిన వ్యక్తి క్వారీ నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం నుంచి కొంతమేరకు అనుమతి తీసుకొని కొండలు కూడా కొట్టేశాడని వాపోయారు. రాత్రికిరాత్రి బిల్లులు లేకుండా గ్రావెల్‌ను తమిళనాడుకు తరలించి లక్షల్లో వ్యాపారం సాగిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. అనుమతి పత్రాలు చూపాలని అడిగితే బెదిరిస్తున్నారని వాపోయారు. ఇప్పటికైనా అధికా రులు క్షుణ్ణంగా పరిశీలించి ప్రభు త్వానికి ఆదాయం చేకూర్చేలా చూ డాలని గ్రామస్థులు కోరారు.

# శాంతి భద్రతలకు..విఘాతం కలిగించొద్దు

## ఎంపీ మిథున్‌రెడ్డికి పోలీసు నోటీసులు

తిరుపతి :పుంగనూరు నియోజకవర్గంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగేలా ఎలాంటి సమావేశాలు, సభలు నిర్వహించేందుకు వెళ్లకూడదని, నియోజకవర్గ పర్యటనను విరమించుకోవాలని రాజంపేట ఎంప్మీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి పోలీసులు సూచించారు. పుంగనూరులో కార్యకర్తలతో సమావేశం నిర్వహించేందుకు తిరుపతిలోని తన నివాసం నుంచి బయల్దేరేందుకు యత్నించిన ఎంప్మీకి ఏఎస్ప్మీ కులశేఖర్ సమక్షంలో పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఎంపీ మిథున్‌రెడ్డి గృహ నిర్బంధంపై పుంగనూరు తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి స్పందించారు. ఎంపీ చేసిన ఆరోపణలను ఆయన తప్పుబట్టారు. గతంలో తెదేపా నాయకులు, కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు, చేసిన దాడులు ఒకసారి గుర్తు చేసుకోవాలన్నారు. గత రెండు సంవత్సరాల్లో ప్రతిపక్షంపై చేసిన దాడులు, అణచివేత కార్యక్రమాలు మీతండ్రిని అడిగి






తెలుసుకోవాలన్నారు. తెదేపా కార్యకర్తలపై 307 కేసులు పెట్టారన్నారు. ఎన్ని ఛార్జిషీట్లు వేశారో, పుంగనూరు నియోజకవర్గంలో పెట్టిన కేసులు, జరిగిన అరాచకాలపై ఒక క్యాసెట్ రూపంలో పంపమంటే పంపిస్తామన్నారు. ఎన్ని రోజులు తెదేపా కార్యకర్తలు ఇళ్లు వదిలి అజ్ఞాతంలో గడిపారో ఓసారి తెలుసుకోవాలని చెప్పారు.

# ఏడీబీ రోడ్డు పనులు ముమ్మరం



రంగంపేట:ఏడీబీ రోడ్డు విస్తరణ పనులు ఇక పూర్తిస్థాయిలో కొనసాగనున్నాయి. రాజానగరం, రంగంపేట మధ్య అత్యంత దయనీయంగా తయారైన ఈ రోడ్డు మరమ్మతుకు బీఎస్ఆర్ సంస్థ ఆదివారం చర్యలను చేపట్టింది. గోవిందరాజపురం,
వెంకన్నపేట, వడిశలేరు, రామస్వామిపేటల వద్ద ఏర్పడిన భారీ గోతుల్లో మెటల్ వేసి పూడ్చే పనులు జరిగాయి. ఈ గోతుల వల్ల ఇక్కడ కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయే పరిస్థితి ఉండేది. బురద, వర్షపు నీరు వెళ్లేందుకు భూమిలో పైపులైను ఏర్పాటు కోసం యంత్రాలతో కాలువను తవ్వారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల తో ఈ పనులకు తరచూ ఆటంకం కలిగింది.

## దాహం తీరాలంటే..

# సరిహద్దు దాటాల్సిందే

ఆదోని :వేసవిలో ఏటా తాగునీటి సమస్యలు తలెత్తడం సర్వసాధారణం. కానీ వర్షాకాలం మొదలైనా.. పల్లెలకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. పశ్చిమ ప్రాంతంలో గుక్కెడు నీటి కోసం గ్రామీణులు అల్లాడుతున్నారు. శాశ్వత పరిష్కారం చూపడంలో గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులు చేతులెత్తేశారు. ఐదేళ్ల వైకాపా పాలనలో తాగునీటి సమస్య పరిష్కరించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. ఎవరైనా అడిగితే రోజు విడిచి రోజు తాగునీరు అందిస్తామని లెక్కలు చెబుతారు. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంటోంది. కర్ణాటక గ్రామాలకు వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవల కొలువుదీరిన ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో ప్రజల నీటి కష్టాలు తీరుతాయని జనం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పశ్చిమ ప్రాంతం ఎక్కువ శాతం ఎల్లెల్సీ కాల్వపై ఆధారపడి ఉంది. ఎల్లెల్సీకి నీరు బంద్ చేయడంతో సమస్య తలెత్తింది. తుంగభద్ర డ్యాం నీటి మట్టం పెరిగిన తర్వాత కాల్వకు విడుదల చేసే అవకాశం ఉంది. ఆదోని ఉమ్మడి డివిజన్‌లో 32 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయి. సుమారు ఎస్ఎస్ ట్యాంకుల్లో 50 శాతం దాక నీరు నిల్వ ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉంది. గ్రామాల్లో బిందెడు నీటి కోసం పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. తాగునీటి పథకాలు ఉన్నా.. నీరు అందడం లేదు. ఆదోని, ఆస్పరి, ఆలూరు, తుగ్గలి, కౌతాళం, పత్తికొండ, కోస్గి, మంత్రాలయం తదితర మండలాల్లో నీటి సమస్య నెలకొంది.



వర్షాకాలంవచ్చినా.. సమస్య తీరడం లేదు. ఆదోని మండలం సంతేకుడ్లురు, పెద్దహరివాణం ఎస్ఎస్ ట్యాంకులు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం హొళగుంద మండలం హెబ్బటం నుంచి అరకొర నీటిని సరఫరా చేస్తున్నారు. అరకొరగానే అందుతుండటంతో గ్రామస్థులు కర్ణాటకలోని బియ్యం సూగూరు, ఇటిక్యాల గ్రామాలకు నాలుగు కి.మీ. తాగునీటి కోసంవెళ్తున్నారు. ఆదోనిమండలం మండిగిరి పంచాయతీలో తాగునీటి సమస్య వేధిస్తోంది. వారం, పది రోజులకోసారి నీరు సరఫరా చేస్తున్నారు. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఎలాంటి నీటి సమస్య లేదని చెబుతూ కాలయాపన చేస్తున్నారు. శాశ్వత పరిష్కరం చూపడంలో విఫలమవుతున్నారు. డివిజన్‌లోని చాలా గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

# 23 నెలలు.. రూ.1000 కోట్ల నష్టం!

## గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోవడంతో సమస్యఅప్రమత్తం

## కాకపోతే నీటి వృథానే- ఏర్పాటుకు మరో రెండు నెలల గడువు



అద్దంకి : ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణ వాసులకు మంచినీరు.. 1.40 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేయబడిన ప్రాజెక్టు. రెండేళ్ల క్రితం ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోయాయి. వాటిని తిరిగి ఏర్పాటు చేయడంలో నాటి పాలకులు ఆసక్తి కనబరచలేదు. గుండ్లకమ్మ నదిలో ఇసుక తవ్వకాల కోసమే గేట్ల గురించి పట్టించుకోలేదని నాటి తెదేపా నాయకులు ఆరోపించారు. వారి ఆరోపణలు తీవ్రరూపం దాల్చిన నేపథ్యంలో దెబ్బతిన్న రెండు గేట్లతో పాటు మెతకగా ఉన్న మిగిలిన గేట్లను మార్చేందుకు నీటిపారుదలశాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. దీనిలో భాగంగా గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లో తయారైన నాలుగు గేట్లను అమర్చారు. మిగిలిన వాటిని ఆగస్టు నెలాఖరు నాటికి బిగిస్తామని చెబుతున్నారు. 2022 ఆగస్టు 31న మూడో నంబరు గేటు, 2023 జూన్ 6న రెండో నంబరు గేటు కొట్టుకుపోయాయి. ఈ కారణంగా జలాశయంలోని నీరు మొత్తం సముద్రం పాలైంది. పడవలు, వలలు, చేపలు మొత్తం కొట్టుకుపోయాయి. ప్రస్తుతం జలాశయం వెనుక నీరు లేకపోవటంతో ఖాళీ భూముల్లో నిర్వాసితులు పశుగ్రాసం సాగు చేస్తున్నారు. గుండక్లమ్మ జలాశయం ఆధారంగా సుమారు రెండు వేలమంది జాలర్లు చేపల వేట ఆధారంగా జీవనం సాగించారు. రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన జాలర్లు కుటుంబాలతో సహా ఇక్కడే దీనిపై ఆధారపడ్డారు. ఒక్కో జాలరి సుమారు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టి వల, పడవ ఏర్పాటు చేసుకున్నారు. ప్రాజెక్టు గేట్లు కొట్టుకుపోవటంతో వారి పెట్టుబడి మొత్తం సముద్రం పాలైంది. చేసేది లేక వారంతా సొంత ప్రాంతాలకు తరలివెళ్లారు. స్థానికంగా ఉన్న జాలర్లు చేపలవేట వృత్తికి దూరమై కట్టెలు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మరికొంత మంది దినసరి కూలీలుగా మారారు. 70 వేల ఎకరాల ఆయకట్టుకు రెండు పర్యాయాలు కలిపి 1.40 లక్షల ఎకరాలకు నీరు అందించడం అనేది రెండేళ్లుగా జరగలేదు. ఆయకట్టులోని భూములున్న రైతులు అధికశాతం వాణిజ్య పంటల వైపు దృష్టి సారించాల్సి వచ్చింది. ఒంగోలు పట్టణానికి మంచినీటి సమస్య ఏర్పడింది. భూగర్భజలం అడుగంటడంతో పరివాహకంలోని రైతులు నీళ్లకోసం ఇబ్బందులు పడ్డారు. నష్టం అంచనా ఇలా...: ఒక్కో జాలరి చేపలు పట్టుకోవటం, విక్రయం ద్వారా నెలకు రూ.25 వేల వరకు ఆదాయం సమకూర్చుకుంటాడు. మొత్తం రెండు వేల మంది జాలర్లు కలిపి రూ.5 కోట్ల వరకు నష్టపోయారు. 23 నెలలకు రూ.115 కోట్ల వరకు నష్టపోయినట్లే. అలాగే ఆయకట్టులోని రైతులు ఒక్కొక్కరూ ఏడాదికి ఎకరాకు గరిష్ఠంగా రూ.30 వేల వరకు ఆదాయం సమకూర్చుకుంటున్నారు. ప్రస్తుతం జలాశయంలో నీరు లేకపోవటంతో కేవలం ఒక పంటకు మాత్రమే పరిమితమవుతున్నారు. రెండేళ్ల కాలపరిమితితో ఒక్కో రైతు సుమారు రూ.60 వేల వరకు నష్టపోయినట్లు లెక్కేస్తే మొత్తంగా 1.40 లక్షల ఎకరాలకు గాను రూ.840 కోట్ల వరకు నష్టపోయినట్లు స్థానికులు అంచనా వేస్తున్నారు.

# కేంద్రం నిధులిస్తే రహ'దారి'

అమరావతి: గుంటూరు నుంచి హైదరాబాద్ మార్గంలో పేరేచర్ల నుంచి కొండమోడు వరకు నాలుగు వరుసల రహదారిగా విస్తరణకు మార్గం సుగమమైంది. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారికి అనుసంధానంగా ఉండే ఈమార్గం రహదారి ప్రమాదాలు, ప్రయాణ సమయం, ఇంధనం ఆదా వంటి లక్ష్యాలతో విస్తరించనున్నారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు నుంచి గుంటూరు సమీపంలోని పేరేచర్ల వరకు జాతీయ రహదారి(167ఏజీ)గా కేంద్రం గుర్తించింది. ఈ మార్గం ప్రాధాన్యత దృష్ట్యా విస్తరణకు కేంద్రం ఆమోదం తెలిపింది. గతేడాది ఆగస్టులో 50కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ.1032 కోట్లతో టెండరు పిలిచారు. ఈ పనులను రాజేంద్రసింగ్ బేంబూ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ దక్కించుకుంది. భారత్‌మాల పరియోజన కింద రహదారి విస్తరణ చేపట్టారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలోనే మంజూరైనా కేంద్రం నిధులు విడుదల చేయకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. పల్నాడు జిల్లా నుంచి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైన లావు శ్రీకృష్ణదేవరాయలు ఈమార్గానికి నిధులు విడుదల చేసి వెంటనే పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రిని కోరారు. దీంతో త్వరలోనే ఈప్రాజెక్టు పట్టా లెక్కనుంది. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించడానికి గుంటూరు, సత్తెనపల్లి ఆర్డీవోల పరిధిలో 234 హెక్టార్ల భూమి సేకరించాలి. సర్వే పూర్తిచేసి ప్రభుత్వ, ప్రైవేటు, అసైన్డు, పోరంబోకు భూములను విభాగాలుగా విభజించి నివేదిక సిద్ధం



చేశారు. రహదారి విస్తరణకు ఏ రైతు నుంచి ఎంత భూమి సేకరిస్తారు? ఎంత పరిహారం లభిస్తుందన్న వివరాలు సిద్ధమయ్యాయి. భూసేకరణకు సంబంధించిన ప్రక్రియ మొత్తం పూర్తిచేసి కేంద్రానికి రాష్ట్రం నివేదిక అందించింది. కేంద్రం భూసేకరణకు నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో సొమ్ము చేసి గుత్తేదారుకు భూమి అప్పగిస్తారు. నాలుగు వరుసల విస్తరణలో ఒక్కొక్క వైపు 8.75మీటర్ల వెడల్పు రహదారి, డివైడర్ 1.5మీటర్లు, రెండువైపులా మార్జిన్‌లు కలిపి 22.5మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారు. మేడికొండూరులో 4 నుంచి 5కిలోమీటర్లు బైపాస్, సత్తెనపల్లిలో 11కిలోమీటర్ల బైపాస్ నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం 7 నుంచి 10మీటర్ల వెడల్పుతో రహదారి ఉండడంతో వాహనాల రద్దీ పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రయాణ సమయం పెరుగుతోంది.

# బాధ్యతలు చేపట్టిన యంత్రాంగం

మాచర్ల, :సహకార రంగం ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం వడివడిగా చర్యలు చేపట్టింది. 2018లో సహకార సొసైటీల పాలకవర్గాల సమయం ముగిసింది. ఆ తర్వాత కొద్దికాలం పాటు వారినే కొనసాగించారు. తర్వాతి ఎన్నికల్లో ప్రభుత్వం మారడంతో వైకాపా పాలనలో సహకార సంఘాల బాధ్యతలను నామినేటెడ్‌గా భర్తీ చేశారు. దీంతో ఈ పదవులను అడ్డుపెట్టుకుని కొందరు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. ఏడుగురు సభ్యులతో సహకార బ్యాంకు పాలకమండలిని, ముగ్గురు సభ్యులతో ఒక్కొక్క సొసైటీకి కమిటీని ఏర్పాటు చేసింది. వీరిది ఆడిందే ఆట అన్నట్లుగా గత అయిదు సంవత్సరాలు గడిచాయి. అదే స్థాయిలో పలుచోట్ల భారీ కుంభకోణాలు జరిగాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పాలకమండలి రాజీనామా చేసి వైదొలిగింది.
సొసైటీల త్రిసభ్య కమిటీలు వైదొలగాలని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చినా మాచర్ల, గురజాల ప్రాంతాల్లోని కొన్ని సంఘాల్లోని కమిటీ సభ్యులు రాజీనామా చేయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని 167 సంఘాలకు కూడా ప్రత్యేకాధికారులను నియమించాలని ఉత్తర్వులు జారీ చేసింది.
సహకార బ్యాంకు అఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జిగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం వెలువడిన ఉత్తర్వులతో రోజున ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని అన్ని సొసైటీలలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు కేటాయించారు.
వీరంతా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేకాధికా రులుగా బాధ్యతల్లో కొనసాగనున్నారు. వైకాపా సర్కారు డీసీసీబీకి ఎన్నికలు జరపకుండా నామినేటెడ్ విధానంలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. అయితే అప్పటికే ప్రత్తిపాడు పరిధిలో నకిలీ పాసు పుస్తకాలతో పొందిన కోట్ల రూపాయల రుణాల అవకతవకలు బయట పడినా మంత్రి కనీసం ఆ ఊసెత్తకపోగా..పాలన బాగుందని కితాబిచ్చారు. సహకార వ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చారని చెప్పుకుంటూ సొసైటీలు, సహకార బ్యాంకుల్లో కోట్ల రూపాయలను వైకాపా పాలనలో నియమితులైన పాలకవర్గాలు బొక్కేశాయి. దీనిపై విచారణకు ఆదేశించినా.. ఒక్కరిపై కూడా చర్యలు చేపట్టిన సందర్భం లేదు.

# లెక్కలో తేడా వస్తే.. అనర్హత వేటే

అనంతపురం :సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు ఎన్నికల వ్యయాలకు సంబంధించిన తుది అకౌంట్స్‌ను సమర్పించాలని పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన ఎన్నికల వ్యయ పరిశీలకులు విలాస్ వి.షిండే అన్నారు. కలెక్టరేట్‌లో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో అకౌంట్స్ రీకన్సలేషన్ మీటింగ్‌ను కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్‌తో కలసి నిర్వహించారు. రాయదుర్గం, ఉరవకొండ, గుంతకల్లు, తాడిపత్రి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు ఐఆర్ఎస్ అధికారి నితిన్ అగర్వాల్, అనంతపురం అర్బన్, రాప్తాడు, శింగనమల, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు రాందాస్ టి.కాలే, జిల్లా సంయుక్త కలెక్టర్ కేతన్‌గార్గ్‌లు హాజరయ్యారు. విలాస్ వి.షిండే మాట్లాడుతూ.. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు వారి నివేదికలను, రిజిస్టర్లను, అకౌంట్స్ పుస్తకాలను డీఈఎంసీకి జూలై 3లోగా అందజేయాలన్నారు. ఈ ప్రక్రియలో ఎన్నికల కమిషన్ నియమ, నిబంధనలను అనుసరించాలన్నారు. ఎన్నికల వ్యయ పరిశీలకులు నితిన్ అగర్వాల్, రాందాస్ టి.కాలే మాట్లాడుతూ.. పోటీ చేసిన అభ్యర్థుల ఏవైనా సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాల న్నారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ..



ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన 30 రోజుల్లోపు అభ్యర్థుల వ్యయాల వివరాలు పూర్తికావాల్సి ఉందన్నారు. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థులు వివరాలను డీఈఎంసీకి అందజేయాలన్నారు. జిల్లా నుంచి ఎన్నికల కమిషన్‌కు జులై 11లోపు పంపాల్సి ఉందన్నారు. పరిమితికి మించి ఖర్చు చేసినా, లెక్కలను సరైన సమయంలో చూపకపోయినా అభ్యర్థులపై అనర్హత వేటు పడుతుందన్నారు. పోటీ చేసిన అభ్యర్థులు నామి నేషన్ తేదీ నుంచి ఎన్నికల ఫలితాల తేదీ వరకు ఖర్చు చేసిన వివరా లను, షెడ్యూల్ 1 నుంచి 11 వరకు అన్ని వివరాలు, బిల్లులు, ఓచర్లు, అఫిడవిట్స్, బ్యాంకు పుస్తకాలు, ఏబీసీ రిజిస్టర్లు సరి చూసుకోవాలన్నారు. వీటన్నింటినీ అభ్యర్థి సంతకంతో జులై 3లోగా అందజేయాలన్నారు.

# పాఠశాలలు ప్రారంభం.. పనులు అర్థాంతరం

అనంతపురం:గత వైకాపా ప్రభుత్వం నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడులను కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తయారు చేస్తామని ప్రగల్భాలు పలికింది. ఐదేళ్ల పాలనలో ఒక్క పాఠశాలలో కూడా పనులు పూర్తి చేయలేదు. ఈ విద్యా సంవత్సరంలో పాఠశాలలు ప్రారంభించి 16 రోజులు పూర్తయినా.. నేటికీ బడుల్లో నాడు-నేడు పనులు పూర్తి కాలేదు. అనంతపురం జిల్లాలో నాడు-నేడు పథకం కింద 1,078 పాఠశాలలు ఎంపిక చేసింది. సౌకర్యాల కల్పనకు రూ.386 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపించారు. గత ప్రభుత్వం మంజూరు చేసినా రూ.149 కోట్లు మాత్రమే విడుదల చేసింది. ఆ నిధులు కూడా సకాలంలో విడుదల చేయలేదు. దీంతో పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. నాడు-నేడు రెండో విడత పథకం 2022లో ప్రారంభించారు. 2024 జులై నాటికి కూడా పూర్తి చేయలేదు. ఇటీవల తెలుగుదేశం నేతృత్వంలోని ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. 'నాడు-నేడు'ను 'స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్'గా పేరు మార్చింది.



ఈపథకంద్వారా పాఠశాలలను ప్రగతి పథంలోనడిపిస్తార ని ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల లకు కిటికీలు,తలుపులురాలేదని ప్రధానోపాధ్యాయులుచెబుతున్నారు. పనులు పూర్తయ్యాయని, కిటికీలు, తలుపులు రాలేదని వారు యాప్ ద్వారా సమాచారం ఇస్తే వెంటనే తెప్పించడానికి చర్యలు తీసుకుంటాం.

# ఎండీయూలతోనే సరకుల పంపిణీ



అనంతపురం : ఏ పార్టీ అధికారంలోకి వస్తే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే చౌకధరల దుకాణాలకు డీలర్లుగా కొనసాగడం ఆనవాయితీ. తాజాగా తెదేపా అధికారంలోకి వచ్చింది. ఇప్పటికే వైకాపా డీలర్లను తొలగించి, అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఇవ్వాలని కోరుతున్నారు. గత వైకాపా ప్రభుత్వం సరకులు పంపిణీకి ఎండీయూ వాహనాలను తీసుకొచ్చింది. వాటి ద్వారా కార్డుదారులకు సరకులు పంపిణీ కొనసాగుతోంది. పాత డీలర్లను పూర్తిగా తొలగించి, ఎండీయూ ఆపరేటర్లకు ప్రత్యామ్నాయం చూపించాలనే ఆలోచనలో తెదేపా ప్రభుత్వం ఉంది. ఈ ప్రక్రియంతా పూర్తి కావాలంటే మరో నెల సమయం పడుతుంది. అయితే ఈ నెల సరకులను ఎండీయూ వాహనాల ద్వారానే కార్డుదారులకు పంపిణీ చేయాలని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి జిల్లాకు ఆదేశాలు అందాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 767 వాహనాలు ఉన్నాయి. ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15 వరకు సరకులు వాహనాల ద్వారా పంచుతున్నారు. వారికి నెలానెలా ఒక్కో వాహనానికి రూ.21 వేలు ప్రభుత్వమే చెల్లించేది. అందులో ఒక్కో వాహనానికి నెలకు రూ.3 వేలు చొప్పున బ్యాంకులకు కంతులను (ఈఎంఐ) ప్రభుత్వమే చెల్లించి, మిగిలిన రూ.18 వేలను ఎండీయూ ఆపరేటర్లకు వేతనం రూపంలో చెల్లిస్తూ వచ్చింది. వాహనాలకు రెండేళ్ల గడువు ఉంది. వాటిని వ్యవసాయశాఖలో రైతు సేవా కేంద్రాలకు గానీ, వైద్యశాఖలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ఉపయోగించే యోచన ఉంది. దీనిపై నిర్ణయం తీసుకొని ఉత్తర్వులు వెలువరించాల్సి ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 3,012 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. మొత్తం 12,08,293 కార్డులు ఉన్నాయి. వీరికి నెలానెలా 30 వేల మెట్రిక్ టన్నుల సరకులు పంపిణీ చేస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎండీయూ వాహనాలు వచ్చినా అంతా డీలర్ల కనుసన్నల్లో పంపిణీ కొనసాగింది. తూకాల్లో డీలర్లు దోచేశారు. తాజాగా ప్రభుత్వం మారింది. తెదేపా నాయకులు, కార్యకర్తలు మాకే పంపిణీ బాధ్యతలు అప్పగించాలని కోరుతున్నారు. చాలాచోట్ల మహిళా సంఘాల సభ్యులకు పంపిణీ బాధ్యతలు అప్పగించారు. మరికొన్ని చోట్ల వైకాపా నాయకులు పాత డీలర్లకే సరకులు సరఫరా చేశారు. కొన్నిచోట్ల మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎండీయూ వాహనాలతో సరకులు పంపిణీ చేయనున్నారు.

# 4 వేల అరటి చెట్లు అగ్నికి ఆహుతి



తాడిమర్రి:మండల పరిధిలోని తురకవారిపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అరటితోటకు నిప్పుపెట్టడంతో 4,000 చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతు శ్రీనివాసులు నాయుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలో మూడు ఎకరాల డెబ్బై సెంట్లలో గత ఏడాది 4,000 అరటి మొక్కలు నాటారు. మొదటి కోత పూర్తయి రెండో కోత కోసేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం కోత కోసేందుకు వ్యాపారులు వస్తున్న సమయంలోనే ఈ దుర్ఘటన జరిగింది. రెండో కోతలో 40 నుంచి 45 టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేశామని, గెలలు కూడా భారీ పరిమాణంలో ఉన్నాయని రైతు తెలిపారు. గెలలు పూర్తిగా కాలిపోయి నల్లగా మారిపోయాయని, రూ.8 లక్షల విలువచేసే కాయలు, రూ.లక్ష విలువ చేసే బిందుసేద్య పరికరాలు, రూ.లక్ష విలువైన పోటు కర్రలు కాలి బూడిదయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానిక ఉద్యాన అధికారి రామాంజనేయులు ఘటనా స్థలాన్ని పరిశీలించి నష్టం అంచనా వేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.
కొత్తచెరువు మండలం మైలసముద్రం గ్రామంలో ఇద్దరు రైతులకు చెందిన 155 చీనీ చెట్లను శుక్రవారం రాత్రి నరికివేశారు.
గ్రామానికి చెందిన వైకాపా నాయకులు ప్రతాపరెడ్డి, కొండారెడ్డి పొలాల్లో 155 చీనీ చెట్లను నరికివేసి, మరో నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి పొలంలో మూడు స్టార్టర్లు ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న సీఐ రాజారమేష్ పొలాల్లో
చీనీ చెట్ల నరికివేతను శనివారం పరిశీలించారు. 45 చెట్లు కాపు దశలో ఉన్నాయని, 110 చెట్లు రెండేళ్ల వయస్సున్నవని సీఐ తెలిపారు. పచ్చని చెట్లను నరికే సంస్కృతి మంచిది కాదన్నారు. కారకులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని సీఐ వివరించారు.

# ఎగవేత పద్దుగా సంతల ఆదాయం

కొత్తచెరువు:కొత్తచెరువు మేజరు పంచాయతీకి జమ కావాల్సిన వేలం ఆదాయం కొండలా పేరుకుపోయి ఎగవేత పద్దుగా మారుతుందనడానికి నిదర్శనగా నిలుస్తోంది. మెరుగైన రవాణా సౌకర్యాలు కలిగిన నాలుగురోడ్ల కూడలి కావడంతో వారపు, దిన సంతలు, బస్టాండు మార్కెట్లలో సుంకం వసూలుకు ఏటా పోటీ తీవ్రంగా ఉంటుంది. పంచాయతీ పరిధిలోని సంతలకు బహిరంగ వేలం నిర్వహించడం సాధారణం. సర్పంచి, అధికారుల సమక్షంలో జరిగిన వేలాలు డిపాజిట్లు, హెచ్చుపాట రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అయితే వేలంలో పాల్గొనడానికి గుత్తేదారులు చెల్లిస్తున్న డిపాజిట్లు మాత్రమే ఖాతాకు చేరుతున్నాయి. వేలం తరువాత రెండు రోజుల్లో మిగిలిన మొత్తాలు చెల్లించాలని, లేదంటే మళ్లీ వేలం నిర్వహిస్తామని నోటీసుల్లో పేర్కొంటున్నా పాలకుల స్వార్థం కారణంగా అమలుకు నోచుకోవడం లేదు. ఇది గుత్తేదారులకు వరంగా మారింది. కార్యదర్శులు నామమాత్రంగా ఒకటి రెండుసార్లు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకొంటున్నారు. ఏడాది గడువు ముగియడంతో గుత్తేదారులు ఇదే అవకాశమని ఎగవేతకు పాల్పడుతుండటంతో పంచాయతీ ఆదాయానికి గండి పడుతోంది. 2021-22లో వారపు సంతకు రూ.2,06,000 బకాయి పడినా అదే గుత్తేదారు 2022-23 బస్టాండు వేలంలో పాల్గొని మళ్లీ రూ.5,07,000 బకాయి పడటం కార్యదర్శి లోపాయికారి ఒప్పందానికి నిదర్శనం. మూడేళ్లుగా ఇదే తంతు కొనసాగుతున్నా కనీసం పర్యవేక్షించి చర్యలు చేపట్టకపోవడం అధికారుల్లో చిత్తశుద్ధి లోపించిందనడానికి నిదర్శనగా నిలుస్తోంది. 2021-22లో వారపు సంత బకాయి రూ.2,06,000, దిన సంత రూ.21,000, బస్టాండు



రూ.61,000, 2022-23లో వారపు సంత బకాయి రూ.2,76,000, బస్టాండు రూ.5,07,000, 2023-24లో వారపుసంత రూ.8,35,000, దిన సంత రూ.4,78,000, బస్టాండు రూ.6,71,000 బకాయిపడ్డారు. మూడేళ్లలో మూడు మార్కెట్ల నుంచి వేలంలో రూ.51.83
లక్షల ఆదాయం లభించింది. డిపాజిటు రూపంలో రూ.21.28 లక్షలు పంచాయతీ ఖాతా వేలం రోజే జమచేయగా రూ.30.55 లక్షలు నేటికీ వసూలు కాకపోవడం కార్యదర్శి నిర్లక్ష్యానికి నిదర్శనగా నిలుస్తోంది. 2023-24లో వారపు సంతకు రూ.6 లక్షలు డిపాజిట్ చెల్లించి వేలంలో రూ.14.35 లక్షలకు పాడుకున్నారు. అలాగే దిన సంతకు రూ.3 లక్షలు చెల్లించి రూ.4.78 లక్షలు, బస్టాండుకు రూ.3 లక్షలు చెల్లించి రూ.6.71 లక్షలకు వేలం పాడారు. అయితే దిన సంత, బస్టాండ్ డిపాజిటు మొత్తాలను కార్యదర్శి స్వాహా చేయడంతో వారపు సంత డిపాజిటు మాత్రమే పంచాయతీ ఖాతాకు జమ చేశారు.

# పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత

రాయదుర్గం:పట్టణ శివారు ప్రాంతాల్లోని బలహీన వర్గాలు, మురికి వాడల ప్రజలకు వైద్య సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం నిర్మించిన పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. రాయదుర్గం పట్టణంలోని గౌడ, బీటీపీ లేఅవుట్‌లు, భంభంబాబా ఆశ్రమం వద్ద ప్రభుత్వం రూ.80లక్షల వ్యయంతో మూడు అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించింది. అత్యాధునిక వసతులు, ల్యాబ్‌లు కూడా ఏర్పాటు చేసి సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించారు. గతంలో ఈ మూడు కేంద్రాలకు ముగ్గురు వైద్యులను నియమించగా.. అందులో ఇద్దరు ఎనిమిది నెలల కిందట ఉన్నత విద్య కోసం సెలవులో వెళ్లారు. అప్పటి నుంచి రెండు వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న ఒకే వైద్యుడు ప్రస్తుతం శిక్షణలు, ఇతర సమావేశాల నిర్వహణకు సరిపోతున్నారు. వారంలో మూడు రోజుల్లో గర్భిణుల పరీక్షలకు మాత్రం కచ్చితంగా హాజరవుతున్నారు. ఒక ఆరోగ్య కేంద్రంలో చికిత్సకు హాజరైతే మరో రెండు చోట్ల ఖాళీగా ఉంటుంది. రెండు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో స్టాఫ్ నర్సులే వైద్యులుగా కొనసాగుతున్నారు. వారే రోగులకు ప్రాథమిక చికిత్స అందిస్తున్నారు. అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. పట్టణ శివారు ప్రాంత ప్రజలు సీహెచ్‌సీలకు వెళ్లాలంటే రవాణా ఛార్జీలు భరించాల్సి వస్తుంది. అక్కడ రోగులు అధికంగా వస్తుండటంతో వరుసల్లో నిలిచి చికిత్స పొందాల్సి ఉంటుంది. ఇక ఆరోజు కూలీ పనులు



మానుకోవాల్సి ఉంటుందని పలువురు వాపోతున్నారు.
పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులను గతంలో జిల్లా స్థాయిలోనే నియమించేవారు. ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో నియమించాల్సి ఉండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. జిల్లాలో 25 పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉండగా రాయదుర్గం, గుంతకల్లు, అనంతపురంలలో రెండేసి చొప్పున, తాడిపత్రిలో 3, కళ్యాణదుర్గంలో ఒక వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ విషయమై జిల్లా నోడల్ అధికారి సుజాతాదేవిని వివరణ కోరగా ఖాళీగా ఉన్న పోస్టులపై ఇటీవల జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. త్వరలో వైద్యులను నియమించే అవకాశం ఉందని వివరించారు.

## రద్దుకు తక్షణ నిర్ణయం..

# పునరుద్ధరణలో జాప్యం

అనంతపురంప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఏ మాత్రం చర్యలు లేవు. కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రైళ్లను రద్దు చేసిన విషయం విధితమే. తర్వాత దశల వారీగా రైళ్లను పట్టాలెక్కించారు. తొలుత రాజధాని రైళ్లు తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లు, ఆ తర్వాత ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించారు. ప్యాసింజర్ రైళ్లను మొన్నటి దాకా ప్రత్యేక ప్యాసింజర్లుగా నడపటంతో ఛార్జీలు ఎక్స్‌ప్రెస్ తరహాలో వసూలు చేశారు. వాటిని కూడా ఇటీవల సాధారణ ఛార్జీలుగా మార్పు చేశారు. ప్రయాణికులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఒకటి, రెండు రైళ్లు ఇప్పటికీ నడవక అనంత రైలు ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బెంగళూరు దండు-విజయవాడ ప్యాసింజర్ (53506/07) రైలు ఇప్పటికీ పునరుద్ధరించలేదు. కరోనా తర్వాత ప్యాసింజర్ రైలు మాత్రం నడవటం లేదు. తొలుత రైల్వే అధికారులు డబ్లింగ్ పనుల తర్వాత నడుపుతామన్నారు. ఆ తర్వాత ఆ రైలును మరచిపోయారు. ఈ రైలు ఉదయం 8 గంటలకు బెంగళూరులో బయలుదేరితే అనంతపురం, గుత్తి, గుంతకల్లు, డోన్, నంద్యాల మీదుగా విజయవాడకు ఉదయం 6 గంటలకు చేరుకునేది. అనంతపురం నుంచి విజయవాడకు వెళ్లే ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ రైలులోనే వారాంతాల్లో వెళ్లే వారు. ఎక్కువ ప్రయాణ సమయం ఉన్నప్పటికీ తక్కువ ధరతో విజయవాడకు తీసుకెళ్లే రైలు కావడం, జిల్లాలో పగటి వేళలో నడుస్తూ ప్రతి చిన్న రైల్వే స్టేషన్‌లోనూ ఆగుతూ వెళ్తుండటంతో గ్రామీణ ప్రయాణికులకు సౌకర్యవంతంగా ఉండేది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు సాయంత్రం 7 గంటలకు విజయవాడలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10.35 గంటలకు అనంతపురానికి చేరుకొని బెంగళూరు వెళ్లేది. దీంతో పగటి వేళలో బెంగళూరు వైపు వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా ఉండేది. ఈ సమయంలో ఇతర రైళ్లు లేకపోవడంతో విజయవాడ ప్యాసింజర్‌కు డిమాండు కొనసాగుతూ



వచ్చింది. అనంతపురం మీదుగా వారానికి ఒక రోజు మైసూర్- శిర్డీ రైలు(16217/18) నడిచేది. ఈ రైలు మైసూర్ నుంచి శిర్డీకి వెళ్లి బుధవారం రాత్రి శిర్డీ నుంచి మైసూర్‌కు వెళుతుంది. జిల్లాకు చెందిన బాబా భక్తులు ఈ రైలులో శిర్డీ వెళ్లడానికి వీలుగా ఉండేది. కరోనా తర్వాత ఈ రైలును తుముకూరు, బళ్లారి మీదుగా శిర్డీకి వెళ్లేలా దారి మార్పు చేశారు.
అప్పట్లో పార్లమెంటు సభ్యులు ఈ రైలు పట్టాలెక్కలేదని అడిగితే బెంగళూరు- గుత్తి డబ్లింగ్ జరుగుతుం డటంతో మార్పు చేశామని చెప్పారు. కానీ డబ్లింగ్ పనులు పూర్తి అవుతున్నాయి. అన్ని రైళ్లు అనంతపురం మీదుగా నడుస్తున్నా ఈ రైలు నడపడంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఈ రైలును తుమకూరు, బళ్లారి మీదుగానే శాశ్వతంగా నడుపుతామని ఇప్పటికే రైల్వే అధికారులు పరోక్షంగా చెబుతున్నారు. ప్రస్తుతం హిందూపురం, అనంతపురానికి చెందిన భక్తులు శిర్డీ వెళ్లడానికి కేవలం బెంగళూరు సిటీ- న్యూఢిల్లీ (12628-27) రైలు మాత్రమే ఉంది. ఈ రైలు కోపర్‌గావ్ దాకా వెళుతుంది. ఈ రైలులో సీట్లు దొరకాలంటే 4 నెలలు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలి.

## 'రుణాల మంజూరులో..

# అక్రమాలు వెలికితీయండి':ఎమ్మెల్యే



అనంతపురం:రాప్తాడు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో మహిళా సంఘాల రుణాల మంజూరులో జరిగిన అక్రమాలను బయటకు తీయాలని ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశించారు. అనంతపురం క్యాంపు కార్యాలయంలో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు, ఏపీవోలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ని మహిళా సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘానికి ఎంత రుణం ఇచ్చారన్న దానిపై సమగ్రంగా నివేదిక అందజేయాలన్నారు. రుణాల మంజూరులో అక్రమాలకు పాల్పడినట్లు తేలితే ఎవరూ తప్పించుకోలేరని హెచ్చరించారు. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులు పూర్తిగా దారి మళ్లినట్లు తెలిసింది. కేవలం ఎస్సీ, ఎస్టీలకే ఉపయోగాల్సిన నిధులను ఇతర అవసరాలకు వాడుకోవడం సరికాదన్నారు. వీటిపై లెక్కలు తేల్చాలన్నారు. వీవోఏల పని తీరు బాగోలేదన్నారు. మహిళలకు జీవనోపాధులు ఏమి కల్పించారో అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి పాల సహకార డెయిరీపై ఆరా తీశారు. డెయిరీలో ఎంత మంది మహిళలు పెట్టుబడి పెట్టారు. ఎంత మందికి ఎంత లబ్ధి చేకూరింది. డెయిరీ స్థితిగతులపై పూర్తి నివేదిక అందజేయాలన్నారు. పింఛన్ల పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఒకటో తేదీన గ్రామ సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అందించాలని ఆదేశించారు.

# గత పాలకుల పాపం.. పురం పురోగతికి శాపం

హిందూపురం: ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం హిందూపురం మున్సిపాలిటీని సర్వ నాశనం చేసింది. 2014-19లో అప్పటి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను అర్థాంతరంగా రద్దు చేసి, పురపాలికపై అదనపు భారం మోపింది. హిందూపురం వాసుల 50 ఏళ్ల కల అయిన నూతన మార్కెట్ నిర్మాణం, తాగునీటి సమస్య పరిష్కారం, ముఖ్యమైన రహదారి విస్తరణ, అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తెదేపా ప్రభుత్వం అంకురార్పణ చేసి ముందుకు తీసుకెళ్తే వాటిని అస్తవ్యస్తం చేసి పట్టణాభివృద్ధిని అటకెక్కించారు. పట్టణంలోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకొని తెదేపా ప్రభుత్వ హయాంలో రూ.66 కోట్లతో రహదారులు, కాలువల నిర్మాణం, ఉద్యానవనాల ఏర్పాటు తదితర పనులు జరిగేలా చూశారు. ఈ పనులు శరవేగంగా సాగుతున్న దశలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రద్దు చేసింది. ఐదేళ్లలో పెరిగిన ధరలకు అనుగుణంగా ఇటీవలే మున్సిపల్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. ఈ పనులు పూర్తి చేయాలంటే రూ.83 కోట్లు అవసరమని నిర్ధారించారు. అంటే పనులు రద్దు చేయడంతో అదనంగా రూ.25 కోట్లు అవసరం అవుతోంది. పట్టణంలో రైల్వే రోడ్ విస్తరణకు ఉన్న న్యాయపరమైన అడ్డంకులను తెదేపా హయాంలో తొలగించారు. విస్తరణ పనులు చేయాల్సిన సమయంలో ప్రభుత్వం




మారింది. రైల్వే రోడ్‌ను విస్తరిస్తామని ముందుకొచ్చిన వైకాపా ప్రభుత్వం ఏమీ చేయలేక చేతులెత్తేసింది. పట్టణంలో రూ.30 కోట్లతో తెదేపా హయాంలో నూతన మార్కెట్‌ను పట్టణ నడిబొడ్డున 4 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించారు. వేలం పాటలు వేయాల్సిన సమయంలో ప్రభుత్వం మారింది. అంతే మున్సిపాల్టీకి ఆదాయం చేకూర్చాల్సిన మార్కెట్ వైకాపా నాయకులకు కామధేనువుగా మారింది. గదుల కేటాయింపు నుంచి మార్కెట్‌లో చిన్నచిన్న పనులు చేయడం వరకు అన్నింటిలోనూ దండుకొన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ రూ.192 కోట్లతో నీటిని తీసుకొచ్చే ప్రాజెక్టును నిర్మించారు.

# రీజనల్ రింగ్ రోడ్ కోసం నిధుల కసరత్తు!



హైదరాబాద్: తెలంగాణకే తలమానికంగా నిలవనున్న రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంపై కేంద్ర, రాష్ట్రాల మధ్య దోబూచులాట కొనసాగుతోంది. ఉత్తరభాగం పనులకు సై అన్న కేంద్రం.... దక్షిణభాగంపై నోరుమెదపడం లేదు. రెండు వైపులు ఒకేసారి చేపట్టాలని కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విజ్ఞప్తి చేసినా.... కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. దాంతో తెలంగాణ ప్రభుత్వం సొంతంగా నిర్మించనుందా అనే చర్చ మొదలైంది. నిధుల సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది ప్రాంతీయ వలయరహదారి దక్షిణభాగం నిర్మాణంపై రాష్ట్రప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. డీపీఆర్ తయారీకి ఇప్పటికే టెండర్లు ఆహ్వానించింది. మొదటిసారి ఒక్క బిడ్ కూడా దాఖలు కాకపోవడంతో రెండోసారి మళ్లీ టెండర్లు పిలవగా...మార్చి 9 వరకు గడవు ఉంది. దక్షిణభాగం పనులకు సుమారు రూ.14 వేల కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. నిధులు సేకరణ, ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ కోసం రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు సైతం పిలిచింది. అలాగే వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌కు సలహాలు, సూచనలు ఇవ్వడానికి సైతం టెండర్లు ఆహ్వానించింది. ప్రాంతీయ వలయ రహదారి ఉత్తరభాగం నిర్మాణంపై ఆసక్తి చూపుతున్న కేంద్రం దక్షిణభాగంపై మాత్రం అంతగా ఆసక్తి చూపడం లేదు. దీంతో కేంద్రం చేతులెత్తేస్తే...రాష్ట్ర ప్రభుత్వమే ఈ పనులు చేపట్టేందుకు ఉన్న అవకాశాలను సైతం రేవంత్‌రెడ్డి సర్కార్ ఆలోచిస్తోంది.

నిధులు సమీకరణం ఎలా చేయాలన్నదానిపై దృష్టిసారించింది. ఇప్పిటికే పలుమార్లు దక్షిణభాగం పనులు తామే చేపడతామని సైతం ప్రకటించింది. నిధుల సమీకరణ కోసం ప్రపంచ బ్యాంకు, జైకా, ఏడీబీ సాయం తీసుకోవాలని యోచిస్తుంది. దక్షిణభాగం పనులు చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూనే... ప్రత్యామ్నయంగా రాష్ట్రప్రభుత్వం సైతం తన పని తాను చేసుకుంటూపోతోంది. డీపీఆర్, పీఎంయూ, నిధుల సేకరణ వంటి వాటికి టెండర్లు పిలిచి...బిడ్ దక్కించుకునే కన్సల్టెన్సీ సంస్థ ఇచ్చే నివేదికనే కేంద్రానికి ఇచ్చి దాని ఆధారంగా ఈ పనులు కొనసాగించే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర ఉన్నాతాధికారులు తెలిపారు...తెలంగాణ రీజనల్ రింగ్ రోడ్ ఉత్తరభాగం పనులకు ఇప్పటికే జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ టెండర్లు ఆహ్వానించింది. దీనికి సంబంధించి ఫిబ్రవరి 17న బిడ్‌లు తెరవనున్నారు. ఐదు ప్యాకేజీల్లో చేపట్టనున్న ఈ పనులు సంగారెడ్డి జిల్లాలోని గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లాలోని తంగడ్‌పల్లి వరకు మొత్తం 161.518 కిలోమీటర్ల మేర సాగనున్నాయి. ఉత్తర భాగం పనులకే రూ.7,104.06 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. టెండర్లు దక్కించుకున్న సంస్థ రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలి. అయితే ఉత్తరభాగం పనులతోపాటు దక్షిణభాగం పనులు సైతం సమాంతరంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. దాదాపు 189.20 కిలోమీటర్ల మేర చేపట్టనున్న ఈ పనులకు రూ.14వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తోంది.ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణంతో తెలంగాణ రూపురేఖలే పూర్తిగా మారిపోనున్నాయి. భూముల ధరలు పెరగడంతోపాటు స్థిరాస్థి వ్యాపారం వృద్ధి చెందనుంది. అలాగే తెలంగాణలోని ప్రతి నగరం, పట్టణానికి జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడనుంది. ముఖ్యంగా కేపిటెల్ సిటీ హైదరాబాద్‌కు వచ్చే మార్గం సుగమం కానుంది.

ఇప్పటికే అందుబాటులో ఉన్న ఓఆర్ఆర్...హైదరాబాద్‌కు మణిహారంగా మారింది. దేశంలోని ఏ రాజధానికి లేని విధంగా...రాజధాని చుట్టూ 150 కిలోమీటర్లకు పైగా నిర్మించిన ఈ ఎక్స్‌ప్రెస్ వేతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతోపాటు... సమీపప్రాంతాలన్నీ అభివృద్ధి చెందాయి. ఇప్పుడు కొత్తగా నిర్మించనున్న ఆర్ఆర్ఆర్‌తో మరింత అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈరెండు వలయ రహదారుల మధ్య ప్రాంతాన్ని తెలంగాణ ప్రభుత్వం వ్యూహాత్మక అభివృద్ధి ప్రాంతంగా భావిస్తోంది.

# అభిరుచులూ వేరయా!

ఆడవాళ్లు-మగవాళ్ల అలవాట్లు వేర్వేరుగా ఉంటాయి. వారి ఇష్టాయిష్టాలు, అభిరుచుల్లోనూ ఎన్నో తేడాలు కనిపిస్తాయి. అయితే, ఆహారం విషయంలోనూ 'ఆడ-మగ' భేదాలు ఉన్నట్లు పలు పరిశోధనలు తేల్చాయి. తీసుకునే ఆహారపదార్థాలే కాకుండా.. శరీరంలో అరుగుదల, పోషకాలను శోషించుకోవడం కూడా వేర్వేరుగానే ఉంటాయని చెబుతున్నాయి.

అందాన్ని పెంచే ఆహారాన్ని ఆడవాళ్లు ఇష్టంగా తింటారట. బరువు తగ్గడం, చక్కని శరీరాకృతి కోసం తక్కువ కేలరీలు ఉండే ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటున్నారు. ఇక మగవారి విషయానికి వస్తే.. ఎక్కువ శక్తినిచ్చే పదార్థాలకు మొగ్గుచూపుతున్నారట. బలం, శక్తిని అందించే మాంసాహారాన్ని ఇష్టంగా తింటున్నారట. అయితే, ఎవరైనా పోషకాహార అవసరాలను దృష్టిలో పెట్టుకొనే ఆహార విధానాన్ని అవలంబించాలని ఆహార నిపుణులు సూచిస్తున్నారు. లింగభేదం లేకుండా.. ఆరోగ్యం కోసమే ఆహారాన్ని ఎంచుకోవాలని అంటున్నారు.

ప్రముఖ సైంటిఫిక్ జర్నల్.. 'కంప్యూటర్స్ ఇన్ బయాలజీ అండ్ మెడిసిన్'లో ఇటీవల ప్రచురించిన ఒక అధ్యయనం మరో విషయాన్ని బయటపెట్టింది. మహిళలు, పురుషులు ఒకేరకమైన ఆహారాన్ని తీసుకున్నా.. దాన్ని అరిగించుకోవడంలోనూ వారి శరీరాలు వేర్వేరుగా స్పందిస్తాయట. పోషకాలను గ్రహించడం నుంచి.. వాటి వినియోగం దాకా వేర్వేరుగానే ఉంటుందట.


మహిళలు-పురుషుల శరీర నిర్మాణంలోనే కాదు.. హార్మోన్లు, జన్యువుల్లోనూ తేడాలు ఉంటాయి. అందుకే.. వారివారి జీర్ణవ్యవస్థలు కూడా ఆహార పదార్థాలను వేర్వేరుగా వినియోగించుకుంటాయి. మహిళల శరీరం.. ఆరోగ్యకరమైన కొవ్వులను బాగా ప్రాసెస్ చేస్తుంది. ఇలాంటి పదార్థాలు మహిళలకు శక్తిని అందిస్తూనే, వారి బరువును కూడా అదుపులో ఉంచుతాయి. ఇక పురుషుల శరీరం కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండే ఆహారాలను సమర్థంగా వినియో గించుకుంటుంది. ఇలాంటి పదార్థాలు వారికి ఎక్కువ శక్తిని ఇస్తాయి.

# తగ్గుతున్న అగ్రవర్ణాల జనాభా!

హైదరాబాద్: అగ్రవర్ణాలు అంటే.. తెలంగాణలో వెలమ, రెడ్లు, బ్రాహ్మణులు, క్షత్రియులు, తదితర కులాలను భావిస్తారు. తెలంగాణలో వెలమ, రెడ్డి, బ్రాహ్మణ సామాజికవర్గం వారే అగ్రవర్ణాలుగా పనిగణింపబడుతున్నారు. ఒకప్పుడు తెలంగాణలో వీరిదే పెత్తనం. దొర, పటేల్ పేర్లతో బీసీలు, దళితులతో పిలిపించుకున్నారు. భూములు వారి చేతుల్లోనే ఉండేవి. అయితే తర్వాత జరిగిన పరిణామాలు, భూపరిధి చట్టం, చదువు అందరికీ అందుబాటులోకి రావడంతో మిగతా సామాజికవర్గాలు కూడా ఎదుగుతున్నాయి. రిజర్వేషన్ల ఫలితంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. అయితే దశాబ్దాలుగా కుల గణన చేపట్టకపోవడంతో రాజ్యాంగం అమలులోకి వచ్చిన నాటి నుంచి ఉన్న రిజర్వేషన్లే 75 ఏళ్లుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మళ్లీ కుల గణన చేసి వాటి ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలో ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందే తాము అధికారంలోకి వస్తే కుల గణన చేస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు 2024లో కుల గణన చేపట్టింది. దానికి సబంధించిన నివేదికను ప్రభుత్వం ఆదివారం(ఫిబ్రవరి 2న) విడుదల చేసింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. ఈ సర్వేలో ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి.కుల గణన నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభాలో బీసీలు 46.25 శాతం ఉన్నారు. అంటే 1.24 కోట్ల మంది బీసీలు ఉన్నారు. ఆ తర్వాత అగ్రవర్ణాలు అంటే ఓసీలు 18 శాతం ఉన్నారు. అయితే వీరిలో ఓసీ ముస్లింలు 2.5 శాతం ఉన్నారు. వీరిని తీసేస్తే హిందూ అగ్రవర్ణాలు 15.79 శాతం మాత్రమే. ఇదే సమయంలో ఎస్సీలు 17.43 శాతం ఉన్నారు. అంటే 61,84,319 మంది ఉన్నారు. ఎస్టీలు 37,05,929 మంది ఉన్నారు. మొత్తం జనాభాలో ఎస్టీ జనాభా శాతం 10.45 గా ఉంది.ఇక తెలంగాణలో ముస్లిం జనాభా భారీగా ఉంది. 44,57,012 మంది ఓసీలు ఉన్నారు. మొత్తం జనాభాలో 12.56 శాతంగా ఉంది. అంటే గిరిజన జనాభాకన్నా ముస్లిం జనాభా పెరిగింది. ఇక బీసీ ముస్లింలను విడిగా లెక్కించారు. వారి సంఖ్య 35,76,588 గా తేలింది. మొత్త జనాభాలో 10.08 శాతంగా ఉన్నారు. మొత్తంగా 96,9 శాతం జనాభాను సర్వే చేశామని, 3,54,77,554 మంది వ్యక్తుల వివరాలు తీసుకున్నామని ప్రభుత్వం ప్రకటించింది. లక్ష ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయని తెలిపారు. మరో 1.68 లక్షల మంది తమ వివరాలు ఇవ్వడానికి నిరాకరించారని తెలిపింది. రాష్ట్రంలో ప్రజలకు సామాజిక సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్ర మాలు అందించడం వలన, బడుగు బలహీన వర్గాల జనాభా పెరిగింది. అగ్రవర్ణ కుటుంబాలు పెద్దగా పట్టు కట్టిన ప్రాంతాల కంటే, వార్షిక ఆదాయం ఎక్కువగా ఉండే, పట్టణాల వైపు వెళ్లడం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో వారి జనాభా తగ్గింది. ఈ విధంగా, అగ్రవర్ణ జనాభా తగ్గడంవారి సంఖ్యలోతగ్గుదల మాత్రమే కాకుండా, సమాజం లో సామాజిక, ఆర్థిక మార్పుల సంకేతాలుగా భావించవచ్చు.

52 నుంచి 46 శాతానికి తగ్గారా..: తెలంగాణలో ఏ లెక్కన చూసినా 50-52 శాతం బీసీలు ఉన్నట్లు తెలుస్తోందని... కానీ ప్రభుత్వం 46.25 శాతంగా ఉన్నట్లు తేల్చడం బాధాకరమన్నారు. సకల జనుల సర్వేకు, ఇప్పటి సర్వేకు 21 లక్షల బీసీ జనాభా తేడా కనిపిస్తోందన్నారు. కేవలం ఓసీల జనాభా పెరిగి ఃఅ, ాఅ, ాు జనాభా తగ్గుతుందా? అని ప్రశ్నించారు.కులగణన సర్వేలో బీసీల జనాభా తగ్గడంపై బీసీ మేధావుల ఫోరం సైతం పలు ప్రశ్నలు లేవనెత్తింది. 2014 సమగ్ర సర్వేలో బీసీల జనాభా 1.85 కోట్లు అంటే 51 శాతం ఉంటే.. ఇప్పుడు 1.64 కోట్లు అంటే 46.25 శాతం మాత్రమే ఉందని ఫోరం నేతలు అన్నారు. ఃఅ, ాఅ, ాు, ముస్లింల జనాభా 25.98 లక్షలు తగ్గిందని అదే సమయంలో ఓసీల జనాభా 15.89 లక్షలు పెరిగిందన్నారు. ఇది ఎలా సాధ్యమని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇచీ ప్రయోజనాలను కాపాడేందుకు ఇలా చేశారని ఆరోపిస్తున్నారు. సర్కార్ ప్రకటించిన కులగణన లెక్కలు తప్పుల తడక అని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆరోపించారు. గత ప్రభుత్వ హయంలో చేసిన సర్వేలో 52 శాతం బీసులు ఉంటే.. ఇప్పుడు 46 శాతానికి ఎలా తగ్గారని ప్రశ్నించారు. బీసీ జనాభా తగ్గి ఓసీల జనాభా ఎలా పెరిగిం దో చెప్పాలన్నారు. బీసీ సామాజిక వర్గ ప్రజల పొట్ట కొట్టడానికే తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని మండిపడ్డారు. ఇచీ రిజర్వేషన్లు కాపాడేందుకు బీసీలకు అన్యాయం చేస్తున్నారని.. ఈ లెక్కలను మళ్లీ రివ్యూ చేయాలని ఆయన ప్రభుత్వా?న్ని డిమాండ్ చేశారు.

# బర్గర్ జంక్ ఫుడ్డేనా?




చాలామంది పిజ్జా, బర్గర్లను జంక్‌ఫుడ్ కిందజమకడుతుంటారు. బర్గర్‌లో కూరగాయల ముక్కలు, బ్రెడ్, కొంచెం చీజ్ మాత్రమే ఉంటాయి కదా%ెూ% నిజంగా ఇది జంక్ ఫుడ్ కిందకే వస్తుందా? ఆరోగ్యానికి మంచిది కాదా? బర్గర్‌లో బన్, కూరగాయల ముక్కలు, మయోనీజ్, సాస్‌లు ఉంటాయి. ఇందులో బన్‌ను మైదాతో చేస్తారు. కాబట్టి అందులో పోషకాలు ఏమీ ఉండవు. ఇక, మయోనీజ్‌లో అనారోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. కొన్నిసార్లు గుడ్డుతో చేసినప్పటికీ అందులోనూ సంతృప్త కొవ్వులు (శాచురేటెడ్ ఫ్యాట్స్) ఎక్కువగా ఉంటాయి. ఇవి కూడా ఆరోగ్యానికి మంచివి కావు. ఇక, మనం మంచివిగా చెప్పుకొనే కూరగాయల ముక్కలు మొత్తం బర్గర్ పరిమాణంతో పోలిస్తే 10 శాతం మాత్రమే. అంతేకాదు, వాటితోపాటు అందులో ఉండే పొటాటో టిక్కీ, వెజ్ టిక్కీలు, ఒకవేళ నాన్‌వెజ్ బర్గర్ అయితే చికెన్ పాటీస్‌లాంటివి డీప్ ఫ్రై చేసిన వంటకాలే! అంటే నూనెలో ముంచి తీసే ఇవి కూడా శరీరానికి ఏమంత మంచివి కావు. కాబట్టి ఇందులో 10 శాతం మినహాయిస్తే, బర్గర్‌ని పోషక విలువలు లేని ఫుడ్‌గానే చెప్పాలి.

ఇలా మార్చేయొచ్చు బర్గర్‌ను అటు రుచికరంగానూ, ఇటు ఆరోగ్యానికి మేలుచేసేదిగానూ మనం తయారు చేసుకోవచ్చు. ఇందుకోసం, బన్‌ని ముడి గోధుమపిండి (హోల్ వీట్ ఫ్లోర్)తో గానీ, రాగులు, ఓట్స్, గోధుమల లాంటి వాటిని కలిపి చేసే మల్టీగ్రెయిన్ ఆటాతో గానీ చేసుకోవచ్చు. మసూర్ దాల్‌ను నానబెట్టి కూడా బన్‌ని చేస్తున్నారు. గోధుమపిండిని ప్రత్యేక పద్ధతుల్లో పులియబెట్టి సాడొను చేస్తున్నారు. దీంతోనూ బన్ బాగుంటుంది. వీటితో మైదా సమస్య ఉండదు.

ఇంట్లో చేసిన పుదీనా చట్నీని సాస్‌ల మాదిరి వాడొచ్చు. హంగ్ కర్డ్‌లో సాల్ట్ పెప్పర్ చాట్ మసాలా కలుపుకొంటే మయోనీజ్ బదులుగా పనికొస్తుంది. ఆలుగడ్డ ఉడకబెట్టి తక్కువ నూనెతో షాలో ఫ్రై చేసిగానీ, ఓవెన్‌లో టిక్కీలాగా చేసుకొనిగానీ వాడుకోవచ్చు. మాంసాహారులైతే చికెన్ ఉడికించి, దాన్ని షాలో ఫ్రైలాగా చేసి పెట్టుకోవాలి. నచ్చిన కూరగాయల ముక్కలను పొడవుగా తరిగి బర్గర్ తయారు చేసుకుంటే సరి. అయితే ఇలా చేసినా కూడా ఇందులో క్యాలరీలు ఎక్కువగా ఉంటాయి. కాబట్టి డయాబెటిస్, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్న వాళ్లు ఎప్పుడో ఒకసారి మినహాయిస్తే, తరచూ తినకపోవడమే మంచిది.

# ప్రొఫైల్ పిక్చర్‌కు ఫ్రేమ్ కట్టేద్దాం




సోషల్ మీడియాలో చాలామంది ఫొటోలు షేర్ చేస్తుంటారు. పైగా వాటిని ఎడిటింగ్ టూల్స్‌లో చూడ చక్కగా తీర్చిదిద్దుతారు. ప్రొఫైల్ పిక్చర్ విషయంలో అయితే మరింత పర్టిక్యులర్‌గా ఉంటారు. మీరూ అదే కోవకు చెందుతారా? అయితే, 'ఫేస్‌బుక్ ఫ్రేమ్ స్టూడియో'ను ట్రై చేయండి.ఎఫ్‌బీలో ప్రొఫైల్ పిక్‌ను మార్చడానికి ఇదో చక్కని ఆప్షన్.ఈ టూల్ ఉపయోగించడం అంత కష్టం కూడా కాదు! ముందుగా ఫేస్‌బుక్ యాప్ ఓపెన్ చేసి, ప్రొఫైల్‌లోకి వెళ్లాలి. తర్వాత ప్రొఫైల్ పిక్చర్‌ను ట్యాప్ చేసి 'యాడ్ ఫ్రేమ్' ఆప్షన్ ఎంచుకోవాలి! అప్పుడు ఫ్రేమ్ స్టూడియో ఓపెన్ అవుతుంది. అక్కడ కొత్త ఫ్రేమ్‌ను క్రియేట్ చేసుకోవచ్చు. ఇక్కడ డిజైన్ ప్రారంభించడానికి ముందు పీఎన్‌జీ ఫార్మాట్ ఫొటో ఎంపిక చేసుకోవాలి. ఆ ఫొటో సైజు 1 ఎంబీ కన్నా తక్కువగా ఉండాలి. ఆ ఫొటోను ఫ్రేమ్ స్టూడియోకి అప్‌లోడ్ చేయాలి. తర్వాత ఫ్రేమ్ స్టూడియో టూల్స్‌ను ఉపయోగించి కస్టమ్ ఫ్రేమ్‌ను ప్రొఫైల్ పిక్చర్‌కు సెట్ చేసుకోవచ్చు.

దీనికినచ్చిన క్యాప్షన్‌లు,లోగోలు, గ్రాఫిక్స్ కూడా జోడించవచ్చు. డిజైన్ ఓకే అనిపి ంచాక, ప్రివ్యూ చూసుకొని.. అవసరమైతే మళ్లీ ఎడిటింగ్ చేయొచ్చు. డిజైనింగ్ పూర్తయ్యాక 'పబ్లిష్' చేసుకోవచ్చు.

# పిల్లల్లో లెక్కల భయం.. పేరెంట్స్ నుంచే!


న్యూఢిల్లీ: కొందరు పిల్లలకు లెక్కలంటే భయం. దీనికి కారణం ఆ పిల్లల తల్లిదండ్రులేనని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. లెక్కలు, అంకెలు.. అంటే తల్లిదండ్రులు భయపడితే, అయిష్టత చూపితే.. వారి పిల్లలు కూడా ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ విద్యలో గణితం సబ్జెక్ట్‌లో వెనుకబడుతున్నారని పరిశోధకులు తెలిపారు.

కొందరు పిల్లలకు లెక్కలంటే భయం. దీనికి కారణం ఆ పిల్లల తల్లిదండ్రులేనని తాజా అధ్యయనం ఒకటి పేర్కొన్నది. లెక్కలు, అంకెలు.. అంటే తల్లిదండ్రులు భయపడితే, అయిష్టత చూపితే.. వారి పిల్లలు కూడా ప్రైమరీ, ప్రీ-ప్రైమరీ విద్యలో గణితం సబ్జెక్ట్‌లో వెనుకబడుతున్నారని పరిశోధకులు తెలిపారు. గణితం పట్ల ఆసక్తికనబర్చే తల్లిదండ్రుల పిల్లల్లో 'మ్యాథ్స్ యాట్కంగ్జైటీ' లేదని అధ్యయనం తెలిపింది. లూఫ్‌బోర్ యూనివర్సిటీ (ఇంగ్లాండ్) పరిశోధకుల అధ్యయనం ప్రకారం, 'మ్యాథ్స్ యాట్కంగ్జైటీ' తీవ్రంగా ఉన్న 126 మంది తల్లిదండ్రులను, వారి పిల్లల గణిత నైపుణ్యాల్ని సైంటిస్టులు పరిశీలించారు.

# ఇంత పరిశుభ్రమైన నది మన దేశంలో.. ఎక్కడో మీకు తెలుసా..?

భారతదేశంలో నదులను ఎంతో పవిత్రంగా చూస్తారు. వీటికి 12 ఏళ్లకి ఒకసారి పుష్కరాలు కూడా చేస్తుంటారు. వీటి ద్వారా కొన్ని ప్రాంతాలకు తాగునీరు లభిస్తుంది. అయితే మన దేశంలో ఎన్నో నదులు ఉన్నాయి. వీటిని పూజించడం మాత్రమే కాకుండా పంటలకు అన్నింటికి కూడా ఉపయోగపడుతుం టాయి. సాధారణంగా సముద్రాలు, నదులు అనేవి ఎక్కడైనా కూడా శుభ్రంగా ఉండవు. వీటిలో ఎక్కువగా కాలుష్యమైనవే ఉంటాయి. ప్లాస్టిక్ చెత్తా, చెదారం వంటివి ఎక్కువగా ఉంటాయి.

అయితే నదుల్లో నీరు స్వచ్ఛంగానే ఉంటుంది. కానీ ఈ మధ్య కాలంలో కొందరు వాటిని పాడు చేస్తున్నారు. అక్కడికి టూర్ అని వెళ్లి ఎక్కువగా తాగడం, తిన్నవి అన్ని కూడా అందులో వేసేస్తారు. వీటికి ఆ నదులు బాగా పాడవుతాయి. అయినా కూడా భారతదేశంలో ఎన్నో నదులు వ్యవసాయం, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతికి బాగా ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా గంగా, యమునా, బ్రహ్మపుత్ర, గోదావరి వంటి ప్రధాన నదులు వ్యవసాయానికి బాగా ఉపయోగపడుతున్నాయి. అయితే మన దేశంలో ఓ నది మాత్రం చాలా శుభ్రంగా ఉంటుంది. అసలు ఇందులో ఎలాంటి చెత్త లేకుండా చాలా పరిశుభ్రంగా కనిపిస్తుంది. ఇంతకీ ఆ నది ఏదో ఈ ఆర్టికల్‌లో చూద్దాం. భారతదేశం దాని వ్యవసాయం,



ఆర్థిక వ్యవస్థ మరియు సంస్కృతికి ముఖ్యమైన నదుల విస్తృత నెట్‌వర్క్‌కు నిలయం. గంగా, యమునా, బ్రహ్మపుత్ర మరియు గోదావరి వంటి ప్రధాన నదులు ప్రజల జీవితాలను ఆదుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయి. భారతదేశంలో డాగి అనే నది అత్యంత పరిశుభ్రమైనది. దీన్ని ఉమ్గోట్ నది అని కూడా పిలుస్తారు. ఇది మేఘాలయలో ఉంటుంది. స్పటిక, స్పష్టమైన నీటికి ఈ నది బాగా ప్రసిద్ధి చెందింది. ఈ నదిని చూడటానికి వెళ్లిన వారు దానికి నచ్చేస్తారు. ఇక్కడికి వెళ్లే పర్యాటకులకు కూడా ఇది మంచి అనుభూతిని ఇస్తుంది.

దీని సహజ సౌందర్యం, నిర్మలమైన వాతావరణ, సహజమైన స్థితి శుభ్రంగా మారేలా చేసింది. ప్రపంచంలోని పరిశుభ్రమైన నదులలో ఒకటిగా నిలిచింది. ఈఉమ్గోట్ నది భారతదేశం, బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో పశ్చిమ జైంతియా హిల్స్ జిల్లాలోని డాకి అనే చిన్న పట్టణం గుండా ప్రవహిస్తుంది. ఆ తర్వాత మేఘాలయలోని ఖాసీ కొండలు, జైంతియా కొండల మధ్య సహజ విభజనగా పనిచేస్తుంది. ఉమ్‌గోట్ నది మూడు ప్రధాన పర్యాటక ప్రదేశాల గుండా ప్రవహిస్తుంది. కాబట్టి దాని చుట్టూ కూడా పర్యాటకులు చూడగలిగే ప్రదేశాలు చాలానే ఉన్నాయి.

ఇక్కడ సాంప్రదాయ సస్పెన్షన్ వంతెనకు ప్రసిద్ధి చెందింది. అలాగే ఎన్నో అందమైన ప్రదేశాలు ఉన్నాయి. అయితే చెత్త ఇందులోకి వెళ్లకుండా జాగ్రత్త వహిస్తారు. మానవ వ్యర్థాలు లేదా నివాస చెత్త దానిని కలుషితం చేయదు. మైనింగ్ కార్యకలాపాల నుంచి ఎటువంటి హానికరమైన రసాయనాలు నదిలోకి ప్రవహించవు. స్థానిక గ్రామస్తులు కూడా నదిని పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటారు. ఈ నదిని తాగునీరుగా కొన్ని గ్రామాల వారు వాడుతుంటారు.

# మెట్రోకు పైసల్లేవ్..!



హైదరాబాద్,: హైదరాబాద్ ప్రజా రవాణాలో మెట్రోది కీలక పాత్ర. నగరంలో ప్రతి రోజూ దాదాపు 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణాలు సాగిస్తుంటారు. నగరం ఓ మూల నుంచి మరో మూలకు వేగంగా, సుఖవంతంగా చేరుకునేందుకు ఎక్కువ మంది ప్రయాణికులు మెట్రోను ఆశ్రయిస్తుంటారు. ప్రస్తుతం ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్- ఎంజీబీఎస్, నాగోల్- రాయదుర్గం మూడు కారిడార్లలో మెట్రో పరుగులు పెడుతోంది. దాదాపు 30కి పైగా ట్రైన్లు ప్రయాణికులకు అందుబాటులో ఉన్నాయి. నగర విస్తరణ దృష్ట్యా మరిన్ని ప్రాంతాలకు మెట్రోను విస్తరించాలని రేవంత్ సర్కార్ డిసైడ్ అయ్యింది.మెట్రో సెకండ్ ఫేజ్‌లో భాగంగా.. కొత్తగా ఐదు కారిడార్లకు సిద్ధమయ్యారు. నాగోల్ నుంచి ఎల్బీనగర్-హయత్‌నగర్‌కు, ఎల్బీనగర్ నుంచి శివరాంపల్లి మీదుగా శంషాబాద్ విమానాశ్రయానికి, ఎంజీబీఎస్ నుంచి ఓల్డ్ సిటీ మీదుగా చాంద్రాయణగుట్టకు, మియాపూర్ నుంచి పటాన్‌చెరు, మైండ్ స్పేస్ నుంచి ఎయిర్‌పోర్టు వరకు మెట్రోను విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు ప్రాజెక్టు డీపీఆర్ సైతం సిద్ధం చేసి ఆమోదం కోసం కేంద్రానికి పంపారు. పలుమార్లు సీఎం రేవంత్ రెడ్డి సహా, ఇతర మంత్రులు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేశారు. అయితే కేంద్ర బడ్జెట్‌లో మెట్రోకు కేటాయింపులు పూర్తి స్థాయిలో జరగలేదు. దేశవ్యాప్తంగా మెట్రో రైలు ప్రాజెక్టులకు కేవలం రూ.31వేల కోట్ల కేటాయింపులు మాత్రమే జరిగాయి.హైదరాబాద్ మెట్రోకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని అడిగినప్పటికీ బడ్జెట్‌లో ఎక్కడా ప్రత్యేక ప్రస్తావన జరగలేదు. రూ.24 వేల కోట్ల అంచనా వ్యయంతో హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్ నిర్మించతలపెట్టగా.. బడ్జెట్‌లో నిధులు మాత్రం కేటాయించలేదు. దేశవ్యాప్తంగా రూ.31 వేలు కేటాయిస్తే అందులో హైదరాబాద్ మెట్రోకు ఏ మేరకు నిధులు దక్కుతాయోనన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కేంద్ర ప్రభుత్వం చేయూత అందిస్తేనే మెట్రో సెకండ్ ఫేజ్ పూర్తవుతుందని అధికారులు చెబుతున్నారు. కానీ బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవటంతో.. ఇప్పట్లో ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం లేకుండా పోయిందని అధికారులు అంటున్నారు.ఇక హైదరాబాద్ రూపురేఖలను మార్చేసేందుకు మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టగా.. ఆ ప్రాజెక్టు నిధులు కేటాయించాలన్న ప్రభుత్వ వినతులను కూడా కేంద్రం పట్టించుకోలేదు. వేలాది కోట్ల రూపాయల మూసీ ప్రాజెక్టుకు.. బడ్జెట్‌లో ఒక్క రూపాయి కూడా దక్కలేదు.

# తెలంగాణకు కొత్త ఎయిర్ పోర్టులు!



హైదరాబాద్, ,: తెలంగాణలో ఎయిర్‌పోర్టులు చాలా తక్కువ. పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్‌లలో నాలుగు, ఐదు ఎయిర్‌పోర్టులు ఉంటే.. రాష్ట్రంలో మాత్రం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఎక్కటే దిక్కు. బేగంపేట ఎయిర్‌పోర్టు వీఐపీల కోసం వినియోగిస్తుండగా.. వరంగల్ మామునూర్ ఎయిర్‌పోర్టు నిజాం కాలంలో సేవలందించేది. ప్రస్తుతం మాత్రం శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి మాత్రమే విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. రాష్ట్రంలో ఎయిర్ పోర్టులు నిర్మించాలని తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా కీలక ప్రకటన చేశారు. పొరుగు రాష్ట్రాల్లో బస్ డిపోల మాదిరిగా ప్రతి 150 కి.మీ ఎయిర్‌పోర్టులు ఉంటే తెలంగాణలో మాత్రం అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టులు నిర్మించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ మేరకు వరంగల్ మామునూరు, కొత్తగూడెం, రామగుండం, ఆదిలాబాద్ ప్రాంతాల్లో ఎయిర్ పోర్టులు నిర్మించాలని డిసైడ్ అయ్యారు. ఈ మేరుకు కేంద్రానికి ప్రతిపాదనలు సైతం పంపించారు.తాజాగా.. తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి. తాజా కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా... 120 కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటుచేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నాలుగు ప్రతిపాదిత ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి అడుగులు పడనున్నాయి. ప్రస్తుతం వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టుకు 696.14 ఎకరాల భూమి ఉంది. ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు మరికొంత భూమి అవసరమని ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. దీంతో 253 ఎకరాలను ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అదనంగా కేటాయింలు చేసింది. ఇక్కడ బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు అడుగులు పడే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.ఇక కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కూడా వేగంగా అడుగులు పడుతున్నాయి.

ఇక్కడ కూడా ప్రభుత్వ భూములు భారీగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మించనుండగా.. ఏఏఐ బృందం ఇప్పటికే ఫీజిబిలిటీ పరీక్షలను నిర్వహించింది. కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేస్తామని తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో వరంగల్ మామునూరు, కొత్తగూడెం ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి ఈ ఏడాదిలోనే అడుగులు పడనున్నాయి.

# మాడ్చేస్తోంది..

విజయవాడ: ఏటా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు పెరుగుదల నమోదవుతుంది. గత శతాబ్ద కాలంలో 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డైన సంగతి తెలిసిందే. 2025 కూడా అదే మాదిరిగా ఉంటుందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. 2023 లో ఆరు నెలలు, 2024 లో ఏడాది పొడవునా రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.1901 నుంచి సేకరిస్తున్న సమాచారం ప్రకారం.. 2024 అత్యంత వేడి సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఉష్ణోగ్రత సగటున 0. 65 డిగ్రీలు పెరిగింది.గతేడాది జనవరి నుంచి ఫిబ్రవరి మధ్యలో సాధారణం కంటే 0.37 డిగ్రీలు పెరిగింది. ఈ ఏడాది జనవరిలో ఉష్ణోగ్రత సగటున 0.94 డిగ్రీలు పెరిగింది.1958 లో 1.17,1990 లో 0.97 డిగ్రీలు పెరిగాయి. ఆ తర్వాత ఇదే హైయ్యేస్ట్ గా తెలుస్తుంది.వాతావరణ మార్పుల ప్రభావం లానినా పరిస్థితుల పై పడుతోంది. లానినా పరిస్థితులు బలహీనపడడంతో శీతాకాలంలోనూ చలి తీవ్రత అసాధారణంగా లేదు. వచ్చే వారం నుంచి తూర్పు, మధ్య భారతంలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి. ఉత్తర, మధ్య ,తూర్పు భారతంలోని కొన్ని ప్రాంతాల్లో అయిదు డిగ్రీల వరకు పెరుగుతాయని నిపుణులు భావిస్తున్నారు.దక్షిణ ,వాయువ్య భారతంలోని కొన్ని మినహా అన్ని ప్రాంతాల్లోనూ వేడి వాతావరణం నెలకొంటుందని చెబుతున్నారు. కేరళలో జనవరిలోనే ఉష్ణోగ్రతలు సాధారణం కంటే అధికంగా నమోదయ్యాయి.



రాష్ట్రంలో రాబోయే రోజుల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.రెండు రోజులుగా ఉక్కపోత ప్రారంభమైంది. కర్నూలు జిల్లా ఆదోని లో శుక్రవారం గరిష్ఠంగా 35.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. పల్నాడు, అన్నమయ్య, వైఎస్సార్, ప్రకాశం, నంద్యాల, అనకాపల్లి, శ్రీసత్యసాయి ,కర్నూలు,అనంతపురం,తిరు పతి, ఎన్టీఆర్ , ఏలూరు తదితర జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 2 నుంచి3డిగ్రీలు పెరిగాయి.తెలుగు రాష్ట్రాల్లో కోస్తాంధ్రతో పోలిస్తే రాయలసీమ, తెలంగాణలో ఉక్కపోత ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# ఇచ్చిన హామీలు అమలు చేయాలి..



నర్సంపేట: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఎలకంటి రాజేందర్ పిలుపు నిచ్చాడు.నర్సంపేట పార్టీ కార్యాలయంలో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమం కరపత్ర ఆవిష్కరణ చేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, ఇందిరమ్మ రాజ్యం ఇంటిట సౌభాగ్యం అంటూ తెలంగాణ రాష్ట్ర ప్రజానీకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు చేసిన వాగ్దానాలు పద్నాలుగు నెలలు గడుస్తున్న పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉందన్నాడు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మినహా మిగిలిన ఐదు గ్యారంటీలలో కొన్ని ఇంకా ప్రారంభమే కాలేదని, తెలంగాణ ప్రజల భవిష్యత్తుని బంగారు బాటలో నడిపిస్తామని గొప్పగా చెప్పిన మాటలన్నీ,నీటిమూటలుగా మారాయని విమర్శించాడు.కేసీఆర్ పాలనలో దగా పడిన తెలంగాణ రాష్ట్రాన్ని, ప్రజల ఆకాంక్షలకు అద్దం పటే విధంగా పాలిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ గత పాలకులు అడుగుజాడల్లో నడుస్తుందన్నారు. అధికారంలోకి రాగానే రైతు బంధు ఎకరానికి 15000 చెల్లిస్తామని,12 వేల రూపాయలు చెల్లిస్తామని ఆడిన మాట తప్పిందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం మంజూరు పారదర్శకంగా లేదన్నాడు.తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన మొదటి సంవత్సరంలోపే రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామన్న సర్కార్ 14 నెలల గడిచినప్పటికి 50 వేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదన్నాడు.ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న నాలుగు లక్షల ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయడంతో పాటు 40 లక్షల నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ రంగాల్లో ఉపాధి హామీ కల్పించాలన్నారు. పోడు సాగు చేసుకుంటున్నటువంటి పదిలక్షల పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.ఆరు గ్యారెంటీలు ప్రకటించి కొనసాగించడంలో విఫలం చెందారని అన్నాడు.ప్రశ్నించే గొంతుకులను పరిరక్షిస్తామని.ఆరు నెలల కాలం కాకముందే దేశంలో పే ప్రొఫెసర్ జి హరగోపాల్, ప్రగశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు సంధ్యతో పాటు వందలాది మంది విప్లవ సంస్థ నాయకులు,కార్యకర్తలపై కుట్ర కేసులు పెడుతున్నారని విమర్శిం చాడు.

గత ప్రభుత్వాల వలె బూటకపు ఎన్కౌంటర్లు నిర్వహిస్తు, ములుగు జిల్లాలో ఎన్కౌంటర్ చేయడం జీవించే హక్కులు కాల రాయడం కాదాని విమర్శించాడు,ఈ నియంతృత్వ ఫాసిస్టు విధా నానికి స్వస్తి చెప్పాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నా రు.రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం హైదరాబాదులో తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, ఏఐకే ఎంఎస్ జిల్లా నాయకులు బోగి సారంగపాని,డివిజన్ నాయకులు భద్రజీ,మల్లన్న,గుగులోత్ కిషన్ స్వామి పీ వై ఎల్ జిల్లా నాయకులు రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రిక ఆనవాళ్లు ప్రతిబింబించేలా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి



ఖమ్మం: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను చరిత్ర ప్రతిబింబించేలాహో అభివృద్ధి చేయాలని, ఆ దిశగా అధికారులు అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో పురావస్తు, పర్యాటక శాఖ అధికారులతో నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు లేక్, ఖమ్మం ఖిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సమీక్షించారు.నేలకొండపల్లి బౌద్ధ స్థూపం, పాలేరు పార్క్, ఖమ్మం ఖిల్లా వంటి పలు పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చేపడుతున్న చర్యల గురించి కలెక్టర్ వివరాలు తెలుసుకుని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌హోమాట్లాడుతూ చారిత్రాత్మక ప్రాంతాల వద్ద సిమెంట్ కట్టడాలను తగ్గించాలని, అక్కడ చేపట్టే ప్రతి అభివృద్ధి పనిలో మన చరిత్ర ప్రతిబింబించేలా అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. చారిత్రక ప్రాంతాల సందర్శకులకు మన చరిత్ర తెలిసే విధంగా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని అన్నారు.హోబౌద్ధ స్తూపం వద్ద ఓపెన్ ఎయిర్ మ్యూజియం ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని, అక్కడ వాకింగ్ పార్క్ ఏరియా అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. రాతి శిల్పాల ప్రదర్శనకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు అధికంగా పర్యాటకులు వచ్చే విధంగా జాతీయ రహదారులలో, ముఖ్యమైన కూడలీల వద్ద సమాచార బోర్డులు, పర్యాటక ప్రాంతాలకు దారి చూపించే సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. మన చరిత్ర తెలిసే విధంగా చారిత్రాత్మక ప్రాంతాల వద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టాయిలెట్ బ్లాకులు, వసతుల కల్పన చేయాలన్నారు. ప్రపంచంలోని ఏథెన్స్ లోని పార్థినన్, ఈజిప్టు కర్నాక్ టెంపుల్ వద్ద అక్కడి చరిత్ర తెలిసే విధంగా అద్భుతంగా ఏర్పాట్లు చేశారని, అదేవిధంగా మన జిల్లాలోని చారిత్రక ప్రాంతాలలో కూడా ప్రజలకు సులువుగా చరిత్ర అర్థమయ్యే విధంగా ఏర్పాట్లు చేయుటకు ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాలేరు లేక్ పార్కు వద్ద ఉన్న పాత నిర్మాణాలకు కావాల్సిన మరమ్మత్తులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సందర్శన ప్రాంతాలుగా తీర్చి దిద్ది, చక్కటి ప్రాంతం సందర్శించిన అనుభూతి కలిగే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పాలేరు పార్క్ వద్ద అవసరమైన టాయిలెట్ బ్లాక్, టికెట్ కౌంటర్, ముఖ్యమైన మరమ్మతులు వెంటనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సందర్శకుల బోటింగ్ కు చర్యలు చేపట్టాలని, కాటేజీ ల నిర్మాణానికి ప్రణాళిక చేయాలని తెలిపారు. ఖమ్మం ఖిల్లా వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పాత్రికేయులు, ఉద్యోగులు, జిల్లాలోని ఇతర ప్రముఖులు పలుమార్లు ఖమ్మం ఖిల్లాను సందర్శించేలా కార్యక్రమాలు రూపొందించాలని, పిక్నిక్ స్పాట్ క్రింద ఖమ్మం ఖిల్లాను అభివృద్ధి చేసేందుకు అక్కడ నాలుగు నుండి ఐదు వ్యూ పాయింట్ లను అభివృద్ధి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఖిల్లా చుట్టూ ఫెన్సింగ్ కు చర్యలు తీసుకోవాలని అన్నారు. రోప్ వే నిర్మాణానికి సమస్యల పరిష్కారం త్వరితగతిన చేయాలన్నారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ నరసింహా రావు, ఆర్కిటెక్చర్ వి. సత్య శ్రీనివాస్, సీనియర్ ఇంజనీర్ వెంకటేష్, టూరిజం శాఖ డిఇ లు ఎన్. రామకృష్ణ, ఎం. వి. శ్రీధర్, పురవాస్తు శాఖ ఏడి లు బి. మల్లు నాయక్, ఎన్. నర్సింగ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పై అవగాహన కార్యక్రమం

కరీంనగర్: జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. వెంకటరమణ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పై అవగాహన కల్పించారు. ఐ ఎం ఏ అసోసియేషన్ సహకారంతో, మున్సిపల్ సిబ్బందికి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. అదే విధంగా క్యాన్సర్ వ్యాధి యొక్క లక్షణాలు, తొలి దశలోనే గుర్తించినట్లయితే, చికిత్స తీసుకోవాలని తెలియజేశారు. ఆరోగ్య మహిళా పథకంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించడం ప్రధానంగా మహిళల్లో వచ్చే 8 రకాల వ్యాధులు అవి క్యాన్సర్ స్క్రీనింగ్, సూక్ష్మ పోష లోపాలు, మూత్రణాల ఇన్ఫెక్షన్స్, రుతుస్రావ సమస్యలు, మెనూపాస్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ మొదలగు వ్యాధులకు కి పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. వెంకటరమణ తెలియజేశారు.

# రాయలసీమ జిల్లాలే లక్ష్యంగా..

కర్నూలు, ,: మొన్నటి ఎన్నికల్లో గెలిచాం. అధికారంలో ఉన్నా..ఇక అంతా లైట్ అంటే కుదరదు. వచ్చే ఎన్నికల కోసమే కాదు..ఫ్యూచర్ ప్లానింగ్ కూడా పకడ్బందీగా ఉండాలంటున్నారు టీడీపీ అధినేత చంద్రబాబు. రాయలసీమలో వైసీపీని తిరిగి పుంజుకో వ్వకుండా వ్యూహాలు రచిస్తున్నారు. ఓ వైపు ప్రభుత్వ పరంగా రాయల సీమ నాలుగు జిల్లాలపై స్పెషల్ ఫోకస్ పెట్టింది వైసీపీ.డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెగ్యులర్ పర్యటనలు..సీఎం చంద్రబాబు అభివృద్ధి పేరుతో రాయలసీమ వాసులకు మరింత దగ్గరయ్యే ప్రయ త్నం చేస్తున్నారు. ఇందులో భాగంగానే మహానాడుకు రాయలసీమనే వేదికగా ఎంచుకుంది టీడీపీ. పైగా జగన్ ఇలాఖ కడపలో పసుపు పార్టీ సంబురం హోరెత్తబోతోంది.మహానాడు టీడీపీకి ఒక పండుగ. పార్టీలో ఉన్న క్యాడర్ మొత్తం ఎంతో ఉత్సాహంగా పాల్గొంటుంది. 2023లో రాజమండ్రిలో టీడీపీ మహానాడు జరిగింది. ఆనాడు రాజమండ్రిలో నభూతో నభవిష్యత్తు అన్నట్లుగా పార్టీ కార్యక్రమాలు సాగాయి. సూపర్ సిక్స్ పథకాల గురించి ఆనాడే ప్రస్తావించారు. దాంతో గోదావరి జిల్లాలలో రాజకీయం గేర్ మార్చింది మహానాడు. అలా వైసీపీకి ఒక్క సీటు కూడా దక్కకుండా చేసి కూటమి కట్టి మరీ టీడీపీ గోదావరి తీరంలో రాజకీయాన్ని తమ వైపు తిప్పుకుంది. ఇక 2024లో మహానాడు నిర్వహించలేదు. అప్పటికి ఏపీలో ఎన్నికలు పూర్తి అయిపోయాయి. ఫలితాల కోసం వేచి చూసే పరిస్థితి ఉంది. దాంతో ఈ సారి ఘనంగా నిర్వహించేందుకు రెడీ అవుతున్నారు.ఇప్పుడు టీడీపీ బంపర్ విక్టరీ కొట్టి పూర్తి ఉత్సాహంలో ఉంది. పైగా వైసీపీ దారుణమైన ఓటమిని మూటగట్టుకుని..నేతల వరుస రాజీనామాలతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో కడపలో మహానాడు నిర్వహించాలని నిర్ణయించింది టీడీపీ. మే 27, 28 తేదీల్లో జరిగే మహనాడుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేయాలని పార్టీ నుంచి ఆదేశాలు వెళ్ళాయి. కడప గడపలో వైసీపీని కోలుకోకుండా చేయడం జగన్ సొంత ఇలాకాలో బస్తీమే సవాల్ విసరడం ద్వారా సీమలో రాజకీయాన్ని ఏకపక్షం చేయాలని టీడీపీ వ్యూహ రచన చేస్తోంది.52 అసెంబ్లీ సీట్లు ఉన్న రాయలసీమలో వైసీపీకి అరడజన్ సీట్లు కంటే కూడా తక్కువ వచ్చాయి. దాంతో రాయలసీమలో వైసీపీ గాలి పూర్తిగా తగ్గిపోయిందని టీడీపీ భావిస్తోం ది. దాంతో తమకు ప్రజలు ఇచ్చిన మద్దతుతో అడ్డాగా మార్చుకో వాలని..రాయలసీమలో పూర్తి స్థాయిలో పైచేయి సాధించాలని చూస్తోంది.జగన్ సొంత జిల్లా ఆ పార్టీకి కంచుకోట అయిన కడపలో పది అసెంబ్లీ సీట్లు ఉంటే కేవలం మూడు మాత్రమే వైసీపీకి గత ఎన్నికల్లో దక్కాయి. ప్రభుత్వం కూడా రాయలసీమ అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఇప్పుడు రాజకీయంగా కూడా సీమలో సైకిల్‌ను నిరంతరంగా పరుగులు పెట్టించాలని టీడీపీ చూస్తోంది. అందుకే రాయలసీమకు గుండెకాయ లాంటి కడపను ఈసారి మహానాడుకు ఎంచుకున్నామంటున్నారు తెలుగు తమ్ముళు ..రాయలసీమ నాలుగు జిల్లాల్లో మొత్తం 52 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఏపీలో ఏ పార్టీ అధి కారంలోకి రావాలన్నా మ్యాజిక్ ఫిగర్ 88 సీట్లు. అందులో సగాని కంటే ఎక్కువ సీట్లు రాయలసీమ రీజియన్‌లోనే ఉన్నాయి. అందుకే వైసీపీని రాయలసీమలోనే కోలుకోలేని దెబ్బకొట్టాలని భావిస్తోందట టీడీపీ. అందుకోసం చంద్రబాబు చాణక్య వ్యూహాలనే అమలు చేస్తు న్నారట.పక్కా వ్యూహంలో భాగంగానే తరచూ రాయలసీమ పర్యట నలు చేస్తున్నారట డిప్యూటీ సీఎం పవన్. ఈ మధ్యే కడప వెళ్ళి మరీ ఎంపీడీవో మీద జరిగిన దాడిని ఖండించి వచ్చారు. ఏకంగా రాయలసీమలోనే క్యాంప్ ఆఫీస్ పెడుతానంటూ ప్రకటించేశారు. రాయలసీమ మీ జాగీరు కాదు..గుండాగిరి చేస్తే ఊరుకునేది లేదంటూ వార్నింగ్ ఇచ్చారు పవన్. లేటెస్ట్‌గా కర్నూలు జిల్లాలో వెళ్లి రోజంతా అక్కడే ఉండి గ్రీన్ కో ప్రాజెక్ట్ పనులను పరిశీలించారు. ఇదంతా ఎందుకు అంటే వైసీపీని రాజకీయంగా నిలువరించడానికే నన్న చర్చ జరుగుతోంది. రాయలసీమలో కూటమిలో ఉన్న బీజేపీ, జనసేన బలానికి..టీడీపీ బలం తోడైతే మరోసారి సీమలో ఎదురు ఉండదని భావిస్తున్నారట. అందుకే వైసీపీకి హార్డ్ కోర్ రీజియన్‌గా ఉన్న రాయలసీమలోనే టీడీపీ మహానాడు నిర్వహించాలని డిసైడ్ అయ్యారట.ఇలా పార్టీ పండుగకు కడపను ఎంచుకోవడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్న చర్చ జరుగుతోంది. గత ఎన్నికల్లో తమకు అనుకూలంగా ఫలితాలు కట్టబెట్టిన రాయలసీమ వాసులకు కృతజ్ఞతలు తెలియజేయడంతో పాటు ఫ్యూచర్‌లో కూడా ఆ ప్రాంత వాసులను తమకు అనుకూలంగా మల్చుకునే ప్లాన్‌లో భాగంగానే రాయలసీమలో మహానాడు నిర్వహించాలని డిసైడ్ అయ్యారట. జగన్ కంచుకోటలో..చంద్రబాబు రాజకీయ వ్యూహాలు ఎంత వరకు ఫలిస్తాయో చూడాలి మరి.

# భయపెడుతున్నకోళ్ల వైరస్!



ఏలూరు, : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోటి కోళ్లు మృత్యువాత పడ్డాయి. నిత్యం వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయని పౌల్ట్రీ రైతులు లబోదిబోమంటున్నారు. గతేడాది డిసెంబర్ లో మొదలైన వైరస్ వ్యాప్తి...జనవరి 13 తర్వాత తీవ్రమైందని రైతులు అంటున్నారు. ఆరోగ్యంగా కనిపించిన గంటల వ్యవధిలోనే కోళ్లు మృతి చెందుతున్నాయని వాపోతున్నారు. కోళ్లలో ఊ15ఔ వైరస్ లక్షణాలు ఉన్నట్లు వెటర్నరీ వైద్యులు చెబుతున్నారు. ఈ వైరస్ శరవేగంగా వ్యాపిస్తుండడంతో...పౌల్ట్రీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.ప్రమాదకర వైరస్ సోకడంతో ఉమ్మడి జిల్లాలో ఇదివరకే 1 కోటి 20 లక్షలకిపైగా కోళ్లు చనిపోయాయని వైఎస్సార్ సీపీ ఆరోపించింది. అవి తాము చెప్పిన మాట కాదని, కోళ్ల మరణాలపై అధికారులు చెప్పిన వివరాలేనని వైసీపీ అంటోంది. కొళ్ల ఫారాలు వద్ద చనిపోయిన కోళ్లు గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. మరోవైపు కోడిగుడ్ల ఎగుమతి భారీగా పడిపోయిందని వైసీపీ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. హైపాతోజనిక్ అవేయిన్ ఇన్ఫ్లుఎంజా స్ట్రెయిన్ వైరస్ సోకినట్లు పశు సంవర్ధక శాఖ అనుమానం వ్యక్తం చేస్తోంది. కూటమి ప్రభుత్వం కోళ్ల వ్యాధులపై కనీసం అవగాహన కల్పించడం లేదని, ఆత్మహత్యలే శరణ్యమని పౌల్ట్రీ రైతులు అంటున్నారంటూ వైసీపీ నేతలు మండిపడుతున్నారు.కాగా, డిసెంబర్ నెలలో ఊ5ఔ1 వైరస్ కేసులు మొదలయ్యాయని, జనవరిలో వాటి తీవ్రత మరింత పెరిగిందని పౌల్ట్రీ రైతులు చెబుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. గతంలో 2012, 2020లోనూ వైరస్ రావడంతో కోళు భారీగా చనిపోగా, పౌల్ట్రీ రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ సమయంలో చికెన్ తినాలంటే కూడా ప్రజలు వణికిపోయేవారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 50 శాతం రైతులు నష్టపోయారని తెలుస్తోంది. దాదాపుగా 40 లక్షల కోళ్లు చనిపోయి ఉంటాయని అంచనా. మేత తిని, గుడ్డు పెట్టిన కొద్ది గంటల్లోనే కోళ్లు మృత్యువాత పడుతున్నాయని రైతులు అంటున్నారు. కోళ్లకు వ్యాక్సిన్ వేస్తున్నా... ఉపయోగం ఉండడంలేదని చెబుతున్నారు. దీంతో బ్యాంకుల నుంచి తెచ్చిన అప్పులు పెరిగి రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని పౌల్ట్రీ రైతులు వాపోతున్నారు.2012, 2020లో ఇదే తరహాలో వైరస్ వ్యాపించి లక్షల్లో కోళ్లు చనిపోయాయి. అయితే ప్రస్తుతం గతంలో కంటే వైరస్ వ్యాప్తి ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు. ఇంత భారీ సంఖ్యలో కోళ్లు చనిపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైరస్ వ్యాప్తికి కారణాలు తెలియకపోవడంతో రైతులు ఆం దోళన చెందుతు న్నారు. పరీక్షల నిమిత్తం కోళ్ల బ్లడ్ శాంపిల్స్ భోపాల్ కు పంపుతు న్నామని రైతులు చెప్పారు.

ఈ వైరస్ వ్యాప్తిని విపత్తుగా ప్రకటించి, తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.పశ్చిమ గోదావరి జిల్లాలో లక్షలాది కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. వైరస్ సోకడంతో జిల్లాలో ఇప్పటికే 1 కోటి 20లక్షలకిపైగా కోళ్లు చనిపోయినట్లు అధికారులు చెబుతున్నారు.కోళ్ల ఫారాలు వద్ద గుట్టలు గుట్టలుగా చనిపోయిన కోళ్లు ఉన్నాయి. దీంతో కోడిగుడ్ల ఎగుమతి భారీగా పడిపోయింది. హైపాతోజనిక్ అవేయిన్ ఇన్ఫ్లుఎంజా స్ట్రెయిన్ వైరస్ సోకినట్లు పశు సంవర్ధక శాఖ అనుమానాలు వ్యక్తం చేస్తుంది. కోళ్ల వ్యాధులపై కూటమి ప్రభుత్వం కనీసం అవగాహన కల్పించడంలేదు. నష్టాలతో ఆత్మహత్యలే శరణ్యం అని పౌల్ట్రీ రైతులు అంటున్నారు"

ఖమ్మం జిల్లాలో: తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో అంతుచిక్కని వైరస్ సోకి వేల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడ్డాయి. పెనుబల్లి మండలంలో ఉప్పయ్య అనే వ్యక్తికి చెందిన కోళ్ల ఫారంలో మూడు వేల బ్రాయిలర్ కోళ్లు, కొత్త కారాయగూడెం గ్రామంలోని నాగేశ్వరరావుకు చెందిన కోళ్ల ఫారంలో మూడు వేల బ్రాయిలర్ కోళ్లు మృత్యువాత పడ్డాయి. వరుసగా కోళ్లు చనిపోతుండడంతో వెటర్నరీ అధికారులు అప్రమత్తమై... కోళ్ల మృతికి గల కారణాలను తెలుసుకునేందుకు హైదరాబాద్ వెటర్నరీ పరిశోధన టీమ్ కు సమాచారం ఇచ్చారు. దీంతో రీసెర్చ్ టీమ్ కోళ్ల ఫారాలను పరిశీలించి శాంపిల్స్ సేకరించింది.కరోనా సమయంలో చికెన్ తింటే అనారోగ్యం బారిన పడతామని కొన్ని రోజులు వీటికి దూరంగా ఉన్నారు. అప్పటి ప్రభుత్వం అవగాహనా కల్పించడంతో చికెన్, కోడిగుడ్ల విక్రయాలు ఊపందుకున్నాయి

# కరెంట్ కు డిమాండ్..!

హైదరాబాద్: వేసవిలో సహజంగానే విద్యుత్ డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ డిమాండ్‌ను తీర్చేందుకు డిస్కంలు ముందస్తుగానే చర్యలు చేపడుతున్నాయి. ఈసారి వేసవి ప్రారంభం కాకముందే ఈ ప్రయత్నాలను విద్యుత్ రంగ సంస్థలు ప్రారంభించాయి. గత ఏడాది మార్చి నెలలో అత్యధికంగా 15 వేల మెగావాట్ల విద్యుత్ డిమాండ్ నమోదైంది. కానీ ఈ సంవత్సరం వేసవి రాకముందే జనవరి నెలలోనే 15,205 మెగావాట్ల డిమాండ్ నమోదయింది. ఇంకా ఎండలు పూర్తిగా ప్రారంభం కాకముందే ఇంత డిమాండ్ ఏర్పడితే, పీక్ సమ్మర్ సీజన్‌లో ఊహించని స్థాయిలో డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి.ఈ డిమాండ్ పెరుగుదలకు కేవలం గృహ వినియోగమే కారణం కాదు. ఇందుకు అనేక కారణాలు ఉన్నాయి. ఈసారి తెలంగాణ రాష్ట్రంలో బాగా వర్షాలు పడి, రికార్డ్ స్థాయిలో పంట దిగుబడి సాధించడంతో వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. అలాగే పారిశ్రామిక, గృహ వినియోగంలో కూడా భారీగా వృద్ధి కనిపిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా జనవరిలో 10 వేల మెగావాట్ల డిమాండ్ ఏర్పడగా, ఒక్క హైదరాబాద్ మహానగరంలోనే 5,000 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. మొత్తంగా చూస్తే 15 వేలకు పైగా మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది పీక్ వేసవిలో కనీసం 17,000



నుంచి 18 వేల మెగావాట్ల డిమాండ్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయని అంచనా. ఈ పరిస్థితులను గమనిస్తూ, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో డిమాండ్‌కు తగిన నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంపై తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు దృష్టి పెట్టాయి. విద్యుత్ సరఫరా సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షలు నిర్వహిస్తున్నారు. పెరుగుతున్న డిమాండ్‌కు తగిన సరఫరా ఎలా ఉందనే అంశంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నిరంతరం మానిటరింగ్ చేస్తున్నారు. ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు సూచిస్తున్నారు.గత ఏడాది జనవరిలో పీక్ డిమాండ్ 13,810 మెగావాట్లు కాగా, ఈ ఏడాది జనవరి 31న రికార్డ్ స్థాయిలో 15,205 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. ఇది గత ఏడాది పీక్ వేసవిలో ఉన్న డిమాండ్ కంటే కూడా ఎక్కువ. గత ఏడాది మార్చి 3న అత్యధికంగా 15,623 మెగావాట్ల డిమాండ్ ఏర్పడింది. ఈ ఏడాది డిమాండ్ ఎంత పెరిగినా, దానికి తగిన సరఫరా అందించేందుకు విద్యుత్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని సంబంధిత అధికారులు తెలిపారు. వేసవిలో విద్యుత్ డిమాండ్ ఒత్తిడిని తట్టుకోవడానికి ప్రతి జిల్లాకు సీనియర్ ఇంజనీర్లను నోడల్ అధికారులుగా నియమించారు. విద్యుత్ కంట్రోల్ రూమ్ 1912ను బలోపేతం చేసి, ప్రజలకు అందుబాటులో ఉంచారు.పెరుగుతున్న డిమాండ్‌కు తగిన విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వం కూడా సిద్ధంగా ఉంది. సింగరేణి నుంచి రోజుకు 17 లక్షల క్యూబిక్ మీటర్ల బొగ్గు సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే సోలార్ పవర్ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయి.

# తెలంగాణ గట్టుపై ఆసక్తికర రాజకీయాలు..?

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా..తెలంగాణ గట్టు మీద ఇంట్రెస్టింగ్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. ఇష్యూ ఏదైనా..టాపిక్ మరేదైనా పీక్‌లెవల్ పొలిటికల్ హీట్‌ను క్రియేట్ చేస్తోంది. రేపే ఎన్నికలు ఉన్నాయన్నంతగా అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్ ఏ మాత్రం తగ్గడం లేదు. సరిగ్గా ఇదే టైమ్‌లో గులాబీ బాస్ కేసీఆర్ సడెన్ ఎంట్రీ ఇచ్చారు.అంతేకాదు తాను కొడతే మామూలుగా ఉండదంటూ..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఆయన మాటలు ఓ వైపు ప్రకంపనలు రేపుతుండగానే..మరోవైపు హస్తం పార్టీ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ అంటూ వార్త తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన దాదాపు 10 మంది ఎమ్మెల్యేలు.. సీక్రెట్ మీటింగ్ పెట్టుకున్నారంటూ న్యూస్ చక్కర్లు కొడుతుండటంతో టీపాలిటిక్స్‌లో హైవోల్టేజ్ హీట్ కనిపిస్తోంది.కేసీఆర్ అసెంబ్లీకి రావాలి..సర్కార్‌కు సలహాలు ఇవ్వాలంటూ..సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ఎన్నిసార్లు రెచ్చగొట్టినా..ఫామ్‌హౌస్‌కే పరిమితం అయిన గులాబీ బాస్ కేసీఆర్..శుక్రవారం రోజు ఎంటర్ దీ డ్రాగన్ అంటూ హాట్ కామెం ట్స్‌తో న్యూస్ మేకర్ అయ్యారు. తాను కొడితే మామూలుగా ఉండదంటూ రేవంత్ సర్కార్‌కు మాస్ వార్నింగ్ ఇచ్చారు.ఇలా కేసీఆర్ మాస్ వార్నింగ్ ఇచ్చారో..? లేదో..? మూడు గంటలైనా గడవక ముందే..కాంగ్రెస్ ఎమ్మెల్యేల సీక్రెట్ మీటింగ్ అంటూ ఓ వార్త బయటికి వచ్చింది. ఇద్దరు మంత్రుల తీరుపై..అసంతృప్తిగా ఉన్న కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రహస్య మీటింగ్ పెట్టుకునారన్న వార్త.. రేవంత్ సర్కార్‌లో ఒక్కసారిగా కలవరానికి దారి తీస్తే..గులాబీ శిబిరంలో మాత్రం ఉత్సాహం నింపుతోందట.సీక్రెట్ భేటీ అంటూ జరుగుతున్న ప్రచారంపై సదరు ఎమ్మెల్యేలు ఆగ్రహంతో ఊగిపోతు న్నారు. మీటింగ్ లేదు..గీటింగ్ లేదంటూ చెప్పుకొస్తున్నారు. అంతేకాదు ఇదంతా కేసీఆర్ కుట్ర అంటూ మరో కోణాన్ని తెరమీ దకు తెచ్చారు. అక్కడితో ఆగకుండా బీఆర్ఎస్ సోషల్ మీడియాపై ఫిర్యాదు చేశారు.ఇదంతా బయటికి బాగానే ఉన్నా..దాల్ మే కుఛ్ తో కాలా హై..అన్న గుసగుసలు అయితే వినిపిస్తున్నాయి. అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ..ఏ ఒక్క పని కావడం లేదని ఆవేదనలో హస్తం పార్టీ ఎమ్మెల్యేలు ఉన్నారట. ముఖ్యంగా బిల్లులు ఇవ్వడం లేదని అమాత్యుల దృష్టికి తీసుకెళ్తే పెద్దగా పట్టించుకోవడం లేదట. ఇప్పటివరకు నాలుగు గోడల మధ్య వ్యక్తం చేస్తున్న వాళ్ల గోడే..సీక్రెట్ మీటింగ్ వరకు వెళ్ళిందన్న చర్చ బలంగా వినిపిస్తుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాకు చెందిన ఒక యువ ఎమ్మెల్యే..కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో భేటీని ఆర్గనైజ్ చేశారట. సదరు ఎమ్మెల్యే తన ఫామ్‌హౌస్‌లో డిన్నర్ ఏర్పాటు చేసి సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్యే లను ఆహ్వానించారట. దాదాపు పది మంది ఎమ్మెల్యేలు డిన్నర్ సమావేశానికి వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ భేటీలో ప్రధానంగా.. తమ ఎదురవుతున్న ఇబ్బందులపైనే చర్చించా రట. డిన్నర్‌కు పిలిచిన ఎమ్మెల్యే మొదట తన నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులు.. అందుకు ఒకరిద్దరు మంత్రులు పెడుతున్న ఇబ్బందులను ప్రస్తావిం చారట. ఒక కీలక మంత్రి తనను సతాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారట. డిన్నర్‌కు అటెండ్ అయిన మిగత ఎమ్మెల్యేలు కూడా ఆయనతో కోరస్ కలిపారట. తమ పరిస్థితులను వివరించుకుంటూ గోడు వెళ్లబోసుకున్నారట.చాలా మంది మంత్రులు అసలు ఎమ్మెల్యేల కు టైమ్ ఇవ్వడం లేదని సమావేశంలో చర్చించుకున్నారట. 11 మంది మంత్రులలో.. సగానికి పైగా మంత్రులు ఎమ్మెల్యేలకు కనీస గౌరవం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారట. కొందరు మంత్రు లు అయితే కనీసం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయట్లేదని ఫ్రస్టేట్ అయ్యారట ఎమ్మెల్యేలు. కొందరు మినిస్టర్లు గంటలకొద్దీ బయట వెయిట్ చేయిస్తున్నారని..ఇంకొందరు మంత్రులు తమ నియోజకవర్గంలో వ్యతిరేక శక్తులను ప్రోత్సహిస్తున్నారంటూ అగ్గిమీద గుగ్గిలం అయ్యారట ఎమ్మెల్యేలు. ఇలా ఎమ్మెల్యేల సమావేశం..డిన్నర్ భేటీ కాస్త..సీక్రెట్ మీటింగ్ అని ప్రచారం జరిగిందట.మంత్రుల తీరుపై ఇప్పటికే ఒకసారి ఫిర్యాదు చేసినా వారిలో ఏమాత్రం మార్పు రావడం లేదని ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేశారట. ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ మందలించినా మంత్రుల్లో మార్పు రావడం లేదట. అమాత్యులు తమ వ్యక్తిగత పనులపై ఫోకస్ పెట్టుకు ంటే..పార్టీ తీవ్రంగా నష్టపోతుందని కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అంతా భావిస్తున్నారట. ఈ పరిణామాలన్నిటినీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారట. ఇదే విషయం బయటకు లీక్ అయిందంటున్నారు.కాస్త రహస్య సమావేశమని.. అటు కాంగ్రెస్‌లో..ఇటు తెలంగాణ పాలిటిక్స్‌లో హీట్ క్రియేట్ చేస్తోంది. ఇలా కాంగ్రెస్ ఎమ్మెల్యేల ప్రత్యేక డిన్నర్ భేటీ..తెలంగాణ పాలిటిక్స్ లో చర్చనీయాంశంగా మారింది. పైకి సీక్రెట్ మీటింగ్ లేదు..ఏమీ లేదని అంటున్నా దాల్ మే కుచ్ కాలా హై అన్న చర్చ అయితే జరుగుతోంది. నిజంగానే ఎమ్మెల్యేలు రహస్య భేటీ అయ్యారా లేక దీని వెనుక ఇంకేమైన మతలబు ఉందా అనేది వేచి చూడాలి మరి.

# రోజూ ఉదయం పరగడుపునే వీటిని తాగండి..

## అధిక బరువు త్వరగా తగ్గుతారు..



మార్పులు చేసుకుంటారు. అలాగే రోజూ వ్యాయామం చేయడం, వేళకు భోజనం చేయడం వంటివి కూడా పాటిస్తుంటారు. అయితే ఇవే కాకుండా రోజూ ఉదయం పలు రకాల డ్రింక్స్‌ను తీసుకోవడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో శరీరంలోని కొవ్వు కరుగుతుంది. అధిక బరువు త్వరగా తగ్గుతారు. పలు రకాల పానీయాలు బరువును తగ్గించేందుకు ఉపయోగపడతాయి. ఈ క్రమంలోనే ఉదయం పరగడుపునే ఆయా పానీయాలను తాగడం వల్ల శరీరానికి ఎంతో మేలు జరుగుతుంది. బరువు తగ్గడంతోపాటు ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి.

**నిమ్మరసం, తేనె..:** రోజూ ఉదయం పరగడుపునే నిమ్మరసం, తేనె నీళ్లను తాగితే అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర చెక్క నిమ్మరసం, ఒక టీస్పూన్ తేనె కలిపి పరగడుపునే తాగాలి. తరువాత 30 నిమిషాల వరకు ఎలాంటి ఆహారాన్ని తీసుకోకూడదు. ఇలా రోజూ చేస్తే శరీర మెటబాలిజం పెరుగుతుంది. క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. ఈ డ్రింక్‌ను తాగడడం వల్ల మెటబాలిజం పెరగడమే కాకుండా శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. తేనె శరీరానికి శక్తిని అందిస్తుంది. నిమ్మరసం వ్యర్థాలను బయటకు పంపుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. రోగ నిరోధక శక్తి సైతం పెరుగుతుంది.

**జీలకర్ర నీళ్లు..:** రాత్రి పూట ఒక గ్లాస్ నీటిలో ఒక టీస్పూన్ జీలకర్రను వేసి నానబెట్టాలి. మరుసటి రోజు ఉదయం ఆ నీళ్లను వడకట్టి తాగేయాలి. జీలకర్ర నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. కేవలం బరువును తగ్గించడమే కాకుండా జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండేందుకు కూడా జీలకర్ర ఎంతగానో సహాయ పడుతుంది. ఈ నీళ్లను సేవిస్తుంటే జీర్ణ క్రియ మెరుగు పడుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం తగ్గిపోతాయి. అలాగే అధిక బరువును తగ్గించడంలో ఉసిరికాయలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. ఉసిరికాయల్లో విటమిన్ సితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొవ్వు కరిగేందుకు సహాయం చేస్తాయి. రోజూ ఉదయం 30 ఎంఎల్ ఉసిరికాయ జ్యూస్‌ను ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కలిపి తాగుతుండాలి. దీంతో శరీరంలోని వ్యర్థాలు బయటకు పోవడమే కాదు, కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. అలాగే రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.

**తేనె, దాల్చిన చెక్క పొడి..:** ఉదయాన్నే పరగడుపునే తేనె, దాల్చిన చెక్క పొడి నీళ్లను తాగినా కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో అర టీస్పూన్ దాల్చిన చెక్క పొడి, ఒక టీస్పూన్ తేనె వేసి బాగా కలిపి సేవించాలి. రోజూ ఇలా తాగుతుంటే మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. ఈ నీళ్లను తాగడం వల్ల షుగర్ లెవల్స్ సైతం తగ్గుతాయి. శరీరానికి శక్తి లభించి రోజంతా ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. యాక్టివ్‌గా ఉంటారు. అదేవిధంగా అల్లం రసం, నిమ్మరసం కలిపి తీసుకుంటున్నా కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త అల్లం రసం, కాస్త నిమ్మరసం కలిపి రోజూ పరగడుపునే తాగుతుండాలి. దీని వల్ల మెటబాలిజం పెరిగి కొవ్వు కరుగుతుంది. అల్లం వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. అల్లం రసం సేవిస్తే అందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలు అధిక బరువును తగ్గించడంలో సహాయ పడతాయి.

# ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?

## మీ శరీరంలో టాక్సిన్లు పేరుకుపోయాయని అర్థం..!

ప్రస్తుతం ఉరుకుల పరుగుల బిజీ యుగంగా మారిన సంగతి తెలిసిందే. దీంతో చాలా మంది ఉదయం నిద్ర లేచింది మొదలు మళ్లీ రాత్రి నిద్రించే వరకు తీరిక లేకుండా గడుపుతున్నారు. దీని వల్ల భోజనం వేళకు చేయడం లేదు. అలాగే వేళకు నిద్రిండం లేదు. శారీరక శ్రమ అసలే ఉండడం లేదు. దీంతో అనేక రోగాల బారిన పడుతున్నారు. ఇలాంటి జీవనశైలి ఉంటే చాలా మందికి టైప్ 2 డయాబెటిస్ వస్తుంది. అధికంగా బరువు పెరుగుతారు. ఇది క్రమేపీ హైబీపీ, గుండె జబ్బులకు కారణమవుతుంది. కనుక ఈ ముప్పు రాకుండా ఉండాలంటే ఆరోగ్యవంతమైన జీవనశైలిని పాటించాల్సి ఉంటుంది. అలాగే శరీరంలో ఉన్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు బయటకు పంపించాల్సి ఉంటుంది. దీంతో శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతే మనకు పలు సంకేతాలను ఇస్తుంది. దీంతో మనం అప్రమత్తం అయి మన బాడీని డిటాక్స్ చేసుకోవాల్సి ఉంటుంది. అందుకు ఏం చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**నోటి దుర్వాసన..:** మన శరీరంలో వ్యర్థాలు మరీ ఎక్కువగా చేరిపోతే అప్పుడు మన నోట్లో బ్యాక్టీరియా సైతం పెరుగుతుంది. దీంతో నాలుకపై తెల్లని ప్యాచ్‌లుగా వస్తాయి. అలాగే నోటి దుర్వాసన ఉంటుంది. ఈ లక్షణాలు కనిపిస్తున్నాయంటే మన శరీరంలో వ్యర్థాలు అధికంగా ఉన్నాయని అర్థం చేసుకోవాలి.

వెంటనే శరీరాన్ని డిటాక్స్ చేయాల్సి ఉంటుంది. అలాగే మొటిమలు, చర్మంపై దురద లేదా దద్దుర్లు రావడం, చర్మం డల్‌గా మారిపోవడం.. వంటి లక్షణలు కనిపిస్తున్నా కూడా శరీరంలో టాక్సిన్లు చేరాయని అర్థం చేసుకోవాలి. తీవ్రమైన అలసట, నీరసం, రాత్రంతా నిద్రించినా కూడా ఉదయం నిద్ర లేవగానే బద్ధకంగా ఉండడం, ఏ పని చేయాలనిపించకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తుంటే శరీరంలో వ్యర్థాలు ఎక్కువగా చేరాయని అర్థం చేసుకోవాలి.

**జీర్ణ సమస్యలు..:** శరీరంలో టాక్సిన్లు అధికంగా చేరిన వారికి తరచూ కడుపు ఉబ్బరం, జీర్ణక్రియ మందగించడం, అజీర్తి, గ్యాస్ ట్రబుల్, మలబద్దకం వంటి జీర్ణ సమస్యలు వస్తుంటాయి. విపరీతమైన తలనొప్పి రావడం, అది కూడా తరచూ రావడం వంటి లక్షణాలు కూడా టాక్సిన్లు



పేరుకుపోయాయని చెప్పేందుకు సంకేతాలుగా భావించవచ్చు. అలాగే శరీరంలో టాక్సిన్లు ఎక్కువగా చేరిన వారికి తీపి తినాలనే కోరిక అధికంగా ఉంటుంది. జంక్ ఫుడ్ తినాలనిపిస్తుంటుంది. అనారోగ్య కరమైన ఆహారాల పట్ల ఆసక్తిని చూపిస్తుంటారు. శరీరంలో వ్యర్థాలు అధికంగా ఉంటే మెదడు పనితీరు సైతం మందగిస్తుంది. జ్ఞాపకశక్తి ఉండదు, ఏకాగ్రత నశిస్తుంది. ఏ పనిపై దృష్టి పెట్టలేకపోతుంటారు. పనిచేయాలనే ఆసక్తి తగ్గుతుంది.

**డిటాక్స్ కోసం ఇలా చేయాలి..:**

ఈ లక్షణాలు ఉన్న వారు వెంటనే శరీరాన్ని డిటాక్స్ చేయాల్సి ఉంటుంది. అందుకు గాను పలు పానీయాలు ఎంతగానో దోహదం చేస్తాయి. గ్రీన్ టీని రోజుకు 2 నుంచి 3 కప్పులు చక్కెర లేకుండా సేవించడం, రోజూ ఉదయం తేనె, నిమ్మరసం నీళ్లను తాగడం,

తేనెను ఆహారంలో భాగం చేసుకోవడం, రాత్రి పూట 1టీస్పూన్ కొబ్బరినూ నెను నిద్రించే ముందు తీసుకోవడం, వేపాకులను లేదా కరివేపాకులను, తులసి ఆకులను ఉదయం పరగడుపునే తినడం, వాము నీళ్లు లేదా జీలకర్ర నీళ్లు, మెంతుల నీళ్లను సేవించడం.. వంటి సూచనలు పాటిస్తే శరీరంలోని టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. ఆరోగ్యంగా ఉంటారు. పైన చెప్పిన లక్షణాలు అన్నీ తగ్గిపోతాయి.

Published & Owned by Mamidi Somaiah, H.No.3- 2-92/27 to 276/506, Rock Town Colony, LB Nagar, Hyd, Rangareddy, Telangana- 500068. Printed at Ellora Printers, LN Nagar, Industrial Estate, Uppal, Rangareddy, Telangana. Editor- Mamidi Somaiah. Ph No. 9 00933723. RNI No. TEL TEL . 2012/48343